Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 13.10.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 19 పేజీలు : 16, వెల : ₹ 5

ప్రజలే ముందు

రైతు సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యం

రైతు సాధికార సంస్థ
రైతుకే ప్రాధాన్యత

దేశ చరిత్రలోనే 24 వేల కోట్ల రూపాయల
రైతు ఋణ ఉపశమనం చేస్తున్న ఏకైక ప్రభుత్వం
ఋణ ఉపశమన 3వ విడత విడుదల మరియు ఉపశమన లేఖల పంపిణీ
గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సువర్ణ హస్తాలతో జరిగింది.

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

ప్రజలే ముందు

# రైతు సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యం

రైతు సాధికార సంస్థ
రైతుకే ప్రాధాన్యత

**ఋణ ఉపశమన 3వ విడత విడుదల మరియు ఉపశమన లేఖల పంపిణీ**
**గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సువర్ణహస్తాలతో జరిగింది.**



## దేశ చరిత్రలోనే 24 వేల కోట్ల రూపాయల రైతు ఋణ ఉపశమనం చేస్తున్న ఏకైక ప్రభుత్వం

ఋణ ఉపశమన పథకము 3వ విడత రూ.3600 కోట్లు విడుదల, రెండు సంవత్సరాలకు వార్షిక 10% వడ్డీతో




- ఇప్పటి వరకు ఇచ్చిన ఋణ ఉపశమనం రూ.14,710కోట్లు (3వ విడతతో కలిపి).
- లబ్ధి పొందిన పంట ఋణము ఖాతాల సంఖ్య 57.57 లక్షలు.
- ఉద్యాన పంటల ఋణ ఉపశమనం రూ.384.47 కోట్లు.
- రూ.4495 కోట్లతో, రూ.50 వేల లోపు ఋణాలు తీసుకున్న 23.45 లక్షల రైతు ఖాతాలకు ఒకేసారి ఋణ ఉపశమనం.
- ఋణ ఉపశమనంలో కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వబడినది.
- మరణించిన రైతుల ఖాతాలకు కూడా రూ.51.54 కోట్ల పూర్తి ఋణ ఉపశమనం కల్పించబడినది.
- ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక అర్హత కోల్పోయిన రైతులకు అవకాశము కల్పించి ఇప్పటికి కూడా పూర్తి పారదర్శకతతో ఋణ ఉపశమనంనకు చేయూత.








**రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

SMD HOMES
Value Beyond Bricks

ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు

# దీపావళి శుభాకాంక్షలు.

బెంగుళూరు వైట్‌ఫీల్డ్స్‌లో
3యకరాల విస్తీర్ణంలో 216 గృహాలతో
నెల్లూరీయుల అరుదైన ఆవిష్కరణ.

AT THE HEART OF IT ALL

SMD ALTEZZ

## అధునాతన నివాస ప్రాంగణం... సకల సదుపాయాల తోరణం


ఉన్నత జీవనం


అధునాతన వసతులు


ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సమీపంలో


వినోదానికి ఆమడ దూరంలో


సకల సౌకర్యాలతో

నిర్మాణ సంస్థ:
నిర్మాణ రంగంలో 15 సంవత్సరాల అపార అనుభవంతో, నాణ్యత, నమ్మకం, నిజాయితీలే పెట్టుబడిగా తమ కట్టుబడిని కొనసాగిస్తూ... చెప్పిన మాటకు కట్టుబడే సంస్థగా వేలాదిమంది ఆత్మీయ అభిమానాలను చూరగొని... నేడు అపురూప హంగులతో అరుదైన ఆఫర్లతో.. అందుబాటు ధరలతో అధునాతన సౌధాలను మీ ముందు ఆవిష్కరిస్తున్న సంస్థ SMD HOMES

SMD ALTEZZ

Sy. no. 11/2 | Next to Govt Jr College | Kumbena Agrahara | Kadugodi | Whitefield | Bangalore
M: +91 99456 50750 | smdhomes.in | sales@smdhomes.in

Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 13.10.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 19 పేజీలు : 16, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## • ఎన్నికల ట్రెండ్ మారుతోంది!

# కోట్లుంటేనే సీటు!



» డబ్బున్నోళ్ళకే టిక్కెట్లలో పెద్దపీట
» ఇరుపార్టీలలోనూ గెలుపుగుర్రాల వేట
» రసవత్తరంగా మారుతున్న ఎలక్షన్ ఆట

ఐపిఎల్ మ్యాచ్‌లొచ్చాక క్రికెట్ వాతావరణం చెడిపోయింది. జట్టు సభ్యులు కలగాపులగమయ్యారు. అన్ని రాష్ట్రాల ఆటగాళ్ళు, అన్ని దేశాల ఆటగాళ్ళు ప్రతి జట్టులోనూ వుంటున్నారు. దీంతో ఫలానాది మా జట్టు.. ఆ జట్టు గెలవాలి అనే ఫీలింగ్ క్రికెట్ అభిమానుల్లో లేకుండా పోయింది. అదే ఐపిఎల్ రాక ముందు వివిధ దేశాల మధ్య ఇంటర్నేషనల్ వన్డే, టి20 మ్యాచ్‌లు జరుగుతుంటే మన దేశం గెలవాలి, ధోనీ సెంచరీ కొట్టాలి... అనే ఫీలింగ్ వేరు. ఇప్పుడు రాజకీయాలలోనూ ఐపిఎల్ వాతావరణం వచ్చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లాగానే ఎలక్షన్ ప్రీమియర్ లీగ్ తయారైంది.

(మిగతా 11వ పేజీలో)




## పార్టీల మధ్య



# కుదురుతున్న స్నేహాలు

అధికారం వేటలో పొత్తులు ప్రధాన భాగమయ్యాయి. ఇంకో పార్టీని కలుపుకుని ఎన్నికలకు పోతే మనకున్న ఓట్లకు మరికొన్ని ఓట్లు జతవుతాయని వందలు, రెండు మూడు వేల ఓట్ల తేడాతో ఓడిపోయే అవకాశమున్న సీట్లను కూడా భాగస్వామ్య పక్షాల మద్దతు ఓట్లతో గెలిచే అవకాశముంటుందన్నది పార్టీల ప్రధాన ఉద్దేశ్యంగా మారిపోయింది. అందుకనే జాతీయ రాజకీయాలలోనైనా, రాష్ట్ర రాజకీయాలలోనైనా ప్రధానపార్టీలు పొత్తులు లేకుండా ముందుకు వెళ్లడం లేదు. 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబు అటు బీజేపీతోనూ, ఇటు పవన్ కళ్యాణ్ పార్టీ జనసేనతోనూ పొత్తు కుదుర్చుకోవడం తెలిసిందే! జనసేన ఎక్కడా పోటీ చేయకపోయినప్పటికీ అన్ని నియోజకవర్గాలలోనూ పవన్ అభిమానుల ఓట్లు తెలుగుదేశానికి కలిసొచ్చాయి. తెలుగుదేశం అభ్యర్థులు చాలా తక్కువ మెజార్టీతో గెలిచిన స్థానాలు 30 దాకా వున్నాయి. పొత్తు ఓట్లు కలిసిరాకుంటే

(మిగతా 11వ పేజీలో)

# కలుపుకుంటేనే... గెలుపు!



## • దూరమైన వారికి చేరువవుతున్న జగన్


దేశంలోని పలు రాష్ట్రాలలో కుల రాజకీయాలు రాజ్యమేలుతున్నా నిన్న మొన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ ఆ వాతావరణానికి దూరంగా వుండింది. ఇక్కడ పార్టీల గెలుపోటములపై కుల ప్రభావం చాలా తక్కువుగా వుండేది. కాని, రాష్ట్ర విభజన పుణ్యమా అని ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలోనూ కుల మంటలు రేగాయి. 2014 ఎన్నికల నుండే రాష్ట్రంలో కుల రాజకీయాలు మొదలయ్యాయి. ఒక్కో పార్టీది ఒక్కో కులం అన్నట్లు వాతావరణం ఏర్పడింది. కులాలే కాదు, మతాల వారీగా కూడా ఓటర్లు విడిపోయారు.

కులాలు, మతాల విభజన వల్లే 2014 ఎన్నికల్లో కొన్ని వర్గాలు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి దూరమయ్యాయి. దీనివల్లే ఆ పార్టీ అధికారానికి కొంచెం దూరంలో ఆగిపోయింది. ముఖ్యంగా జగన్‌పై టీడీపీ అనుకూల మీడియా క్రైస్తవ ముద్రను వేసింది. అదే పనిగా ప్రచారం చేసి హిందువులలో బ్రాహ్మణ, వైశ్య వర్గాలను వైకాపాకు దూరం చేసాయి. వైకాపా అధికారంలోకి వస్తే క్రిస్టియానిటీ పెరిగిపోతుందని చేసిన ప్రచారం గత ఎన్నికల్లో బాగానే పని చేసింది. గత ఎన్నికల్లో పచ్చ మీడియా చేసిన ప్రచారం వల్ల వైకాపాకు క్షత్రియ కులస్థులు కూడా దూరమయ్యారు. ఇక చంద్రబాబు ఇచ్చిన ఋణ మాఫీ వాగ్ధానంతో రైతులు, మహిళలు కూడా వైకాపాకు ఓట్లు వేయలేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మూలంగా ఈ రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లయిన కాపు కులస్థులు కూడా వైకాపాకు మద్దతివ్వలేదు. వీళ్ల ఓట్లు కూడా చంద్రబాబుకే పడ్డాయి. గత ఎన్నికల్లో తనకు దూరమైన

(మిగతా 11వ పేజీలో)



# కళ్యాణ వైభవం...!



బీజేపీ నాయకులు నందిమండలం చంద్రశేఖర్‌రాజు - వసుంధరదేవిల కుమార్తె **శ్రీరమ్య - సాయికృష్ణ** (నెల్లూరు వాస్తవ్యులు నందిగం నరసింహారావు - విజయలక్ష్మిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 5వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరుగగా, ముందురోజు 4వ తేదీ జరిగిన రిసెప్షన్ వేడుకకు భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు హాజరై వధూవరులను దీవించారు. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.



కొడవలూరు మండలం నార్తురాజుపాలెం వాస్తవ్యులు డాక్టర్ ఆములూరు బాబూరావు - విమలల కుమారుడు **నిషాంత్ - నిహారిక** (గుంటూరుజిల్లా వాస్తవ్యులు అరిగ సుబ్బారెడ్డి - లక్ష్మిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 6వ తేదీ హైదరాబాద్‌లోని శ్వేత గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



సీనియర్ న్యాయవాది కంభం వెంకటరెడ్డి - నీరజల కుమారుడు **పూర్ణ కపిల్‌రెడ్డి - జ్యోతి ఐశ్వర్యరెడ్డి** (విశాఖ వాస్తవ్యులు ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి - ఉమాకృష్ణవేణిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 6వ తేదీ విశాఖపట్నంలోని సెంటినరీ ఆడిటోరియం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### ఎగువ జిల్లాల్లో వర్షం..

# నెల్లూరు జిల్లాలో హర్షం



నెల్లూరుజిల్లా ప్రజలకు ఈ జిల్లాలో వర్షాలు పడితేనే కాదు, ఎగువ జిల్లాలైన అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు పడితేనే ఎక్కువ సంతోషం. ఆ జిల్లాల్లో వర్షాలు పడితే ఎక్కువ ప్రయోజనం పొందేది మనమే. నెల్లూరుజిల్లాలో భారీ వర్షాలు కురిసి పెన్నా నది ప్రవహించినా ఆ నీళ్ల సముద్రం పాలు కావడం తప్పితే ఇంకేమీ వుండదు. అదే కడప, కర్నూలు జిల్లాల్లో వర్షాలు కురిసి ఉపనదులు, వాగులు పొంగితే సోమశిలకు నీళ్లొస్తాయి. ఇటీవల కర్నూలు, కడప జిల్లాల్లో బాగానే వర్షాలు పడ్డాయి. కుందూ, పాపఘ్ని వంటి నదులు ప్రవహించి పెన్నలో కలిసాయి. దీంతో సోమశిల ఎగువ ప్రాంతాల నుండి వచ్చిన వరద ప్రవాహంతో సోమశిల రిజర్వాయర్‌లో దాదాపు 32టిఎంసీల నీళ్ల చేరాయి. మొన్నటివరకు డెడ్‌స్టోరేజ్‌లో వున్న డ్యాంలోకి 32టిఎంసీల నీళ్ల రావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

### • కనికరించని న్యాయస్థానం

# ఆనంకు చుక్కెదురు?






సింహపురి సమాచారం

నెల్లూరు నగరంలో తమ ఆధిపత్యానికి ఆయువు పట్టులాంటి విఆర్ విద్యాసంస్థలపై తమ పట్టు నిలుపుకోవాలని ఆనం సోదరులు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. న్యాయస్థానంలో వరుస దెబ్బలు తగులుతూనే వున్నాయి. విఆర్ విద్యాసంస్థల పాలక కమిటీని రద్దు చేస్తూ ఈ ఏడాది మార్చి 6వ తేదీన హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కరస్పాండెంట్ ఆనం వివేకానందరెడ్డి దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఈ నెల 11వ తేదీన హైకోర్టు కొట్టి వేసింది. దీంతో వి.ఆర్ విద్యాసంస్థలను తమ చేతుల్లో నుండి పోకుండా చూసుకోవాలనుకున్న ఆనం సోదరుల ఆశలు గల్లంతయ్యాయి.

1875 ప్రాంతంలో వెంకటగిరి రాజాలు విఆర్ విద్యా సంస్థలను ప్రారంభించారు. 1970 వరకు విఆర్ విద్యాసంస్థలపై వెంకటగిరి రాజాల పెత్తనమే సాగింది. 1970లో పెద్ద రాజాయాచేంద్ర మరణంతో ఆనం కుటుంబం ప్రవేశించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో విఆర్ విద్యాసంస్థల కమిటీకి ఆనం వెంకటరెడ్డి అధ్యక్షుడయ్యాడు. అప్పటినుండి ఆనం వాళ్ళే పెత్తనం చేయసాగారు. 1970 నుండి 1985 వరకు విఆర్ కమిటీకి ఎన్నికలు జరుపకుండా ఆనం కుటుంబమే నేతృత్వం వహిస్తూ వచ్చింది. కమిటీకి వెంటనే ఎన్నికలు జరపాలంటూ అప్పట్లో ఏబివిపి నాయకులుగా వున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆమంచర్ల శంకరనారాయణ, చంద్రశేఖర్‌రాజులు నెల్లూరులో ఆరు రోజుల పాటు నిరాహారదీక్ష చేసారు. అప్పుడు ముఖ్యమంత్రిగా వున్న ఎన్టీఆర్ ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీతో వీళ్ళు దీక్ష విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ విఆర్ విద్యా సంస్థల కమిటీకి 1986లో ఎన్నికలు పెట్టించారు. అయితే పూర్వవిద్యార్థుల ఓట్లతో ఎన్నికలు నిర్వహిస్తే తమకు వ్యతిరేకంగా ఫలితాలు వస్తాయని వూహించిన ఆనం సోదరులు బైలాను సవరించి, పూర్వ విద్యార్థులకు ఓట్లు లేకుండా చేసి ఎన్నికలు పెట్టారు. అప్పుడే తమ ఓట్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ పూర్వవిద్యార్థులు నెల్లూరు సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో కోర్టు ఎన్నికల కౌంటింగ్‌ను నిలిపేసింది. 1993లో కోర్టు పూర్వవిద్యార్థుల పిటిషన్‌ను కొట్టి వేయడంతో 1986లో జరిగిన ఎన్నికల ఓట్లను అప్పుడు లెక్కించారు. ఆనం వివేకానందరెడ్డి కరస్పాండెంట్ మరియు కార్యదర్శిగా, ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షుడిగా, మరో ఏడు మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. క్రింది కోర్టు తమ పిటిషన్‌ను కొట్టి వేసినా విఆర్ పూర్వవిద్యార్థులైన ఆమంచర్ల శంకరనారాయణ, గూడూరు విజయరామిరెడ్డి, పాతూరు రమణయ్యలు ఆ కేసును వదల్లేదు. 1996లో హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేసారు. వారి పోరాట ఫలితమే విఆర్ విద్యాసంస్థల కమిటీని రద్దు చేస్తూ ఈ ఏడాది మార్చిలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు. ఈ తీర్పును పున పరిశీలించాలంటూ ఆనం వివేకానందరెడ్డి వేసిన రివ్యూ పిటిషన్‌ను తాజాగా హైకోర్టు కొట్టివేయడంతో విఆర్ విద్యాసంస్థలపై ఆనం సోదరుల ఆశలు అడుగంటినట్లయ్యాయి.

### విధినిర్వహణలో అంకితభావానికి ప్రతీక

# మన రాంబాబు



### గూడూరు డిఎస్పీగా బాధ్యతల స్వీకరణ

నెల్లూరులో గడగడలాడించాడు... రౌడీలకు దడ పుట్టించాడు అని చెప్పుకోగల కొద్దిమంది ఎస్ఐలలో ఒకరు వాకా శ్రీరాంబాబు. ఒకప్పుడు ఆయన ఎస్.ఐ. ఇప్పుడు డిఎస్పీ. గూడూరు కొత్త డిఎస్పీగా 11వ తేదీ గూడూరులోని పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా దర్శి డిఎస్పీగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ డిఎస్పీగా పని చేసిన బాదేపల్లి శ్రీనివాస్‌ను పలు ఆరోపణల నేపథ్యంలో విఆర్‌లో పెట్టడం తెలిసిందే!

ఇక విఎస్ రాంబాబు గురించి నెల్లూరుజిల్లాలో తెలియని వారుండరు. నెల్లూరుజిల్లాకు చాలా సుపరిచితుడు. నెల్లూరు మూడోనగరం, కావలి, బోగోలు, వెంకటగిరిలలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. నెల్లూరులో త్రీటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు ట్రంకురోడ్డులో బాబు ఐస్‌క్రీమ్స్ ఎదురుగా వున్న కేథలిక్ సిరియల్ బ్యాంకులో దాదాపు 2కోట్లు నగలు, నగదు దోపిడీ జరిగింది. ఈ కేసును చేధించి నిందితుడిని పట్టుకోవడంలో అప్పుడు ఎస్ఐగా వున్న రాంబాబు కీలకపాత్ర పోషించి ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్నారు. ఎస్ఐగా పనిచేసిన ప్రతిచోటా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. అలాగే సిఐగా పదోన్నతి పొందాక మొదట సిఐడిలో పని చేసారు. ఆ తర్వాత నెల్లూరు, కోవూరులతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐగా పనిచేశారు. డిఎస్పీగా పదోన్నతి పొందాక సిఐడి డిఎస్పీగాను, నెల్లూరురూరల్ డిఎస్పీగాను పనిచేసి ఆ తర్వాత ప్రకాశంజిల్లా దర్శి డిఎస్పీగా బదిలీ అయ్యారు. మళ్ళీ అక్కడనుండి తనకెంతో అనుబంధమున్న నెల్లూరుజిల్లాలోనే గూడూరు డిఎస్పీగా వచ్చారు. గూడూరు డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాంబాబును కలిసి డివిజన్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ‘తండ్రి’ని వీడి... ‘తల్లి’ వద్దకు సత్యకుమార్

# పెద్దాయన నుండి పార్టీ సేవకు...

*గత 24 సంవత్సరాలుగా వెంకయ్యకు తోడుగా ఆయన నీడగా నిత్యం ఆయనను వెన్నంటి వుండిన ఆయన వ్యక్తిగత కార్యదర్శి సత్యకుమార్ భారత ఉపరాష్ట్రపతి ప్రత్యేక అధికారిగా తన పదవికి రాజీనామా చేశాడు. తండ్రి లాంటి పెద్దాయనను వదిలి ఆయనిప్పుడు తల్లి లాంటి పార్టీ సేవకు శ్రీకారం చుట్టాడు. పార్టీకి సేవ చేయాలి, పార్టీ కోసం పరితపించాలి అన్న సత్య మనోగతాన్ని గమనించిన భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అక్టోబర్ 1వ తేదీ సత్యకుమార్‌ను పిలిపించి పార్టీ కార్యకలాపాలలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించడంతో సత్యకుమార్ ఇప్పుడు పూర్తిస్థాయి భారతీయ జనతాపార్టీ కార్యకర్తగా అవతరించాడు.*

అక్టోబర్ 2వ తేదీ నుండి భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో కేరళలో ప్రారంభమైన “జనరక్షక్ యాత్ర” సమన్వయకర్తగా వ్యవహరించవలసిందిగా అమిత్‌షా కోరడంతో వెంటనే వెంకయ్యనాయుడిని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకుని ‘కేరళ’ వెళ్ళిపోయాడు.

కేరళకు జాతీయ స్థాయి నాయకులను రప్పించడం, స్థానికంగా వున్న నేతలు, కార్యకర్తలతో సమావేశమై కార్యక్రమాన్ని సజావుగా నడిపించడం, సమన్వయ పరచడంతో పాటుగా మీడియా వ్యవహారాలను చూసే బాధ్యతల్లో ప్రస్తుతం ‘సత్య’ తలమునకలై వున్నాడు.

వెంకయ్యనాయుడిని వీడి తాను పార్టీ సేవకై వెళ్లవలసిన తరుణంలో “సామాజిక మాధ్యమంలో” సత్యకుమార్ ఆంగ్లంలో పోస్ట్ చేసిన “అంతరంగాన్ని” ‘లాయర్’ పాఠకుల కోసం తెలుగులో తర్జుమా చేసి యధావిధిగా అందిస్తున్నాం.



కేరళలో నిర్వహిస్తున్న ‘జనరక్షక్ యాత్ర’లో
కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌తో కలసి పాల్గొన్న సత్యకుమార్



“కృతజ్ఞత అన్నది ఓ అనుభూతి. అది ఓ భావోద్వేగంతో కూడుకున్న మాటలలో చెప్పలేని భావన.”

- వై.సత్యకుమార్

## సత్య అంతరంగం ఆయన మాటల్లోనే...

జీవితం అంటే ఎంపిక ద్వారా నిర్ణయాలు తీసుకోవడమే. నా జీవితంలో క్లిష్టమైన సమయాలలో ప్రతిసారీ ఎన్నుకోవడం ద్వారా నేను నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. నేను ఎన్నుకున్న ప్రతి మార్గం సరైనదే అని కాలం రుజువు చేసింది. అలా ఎంపిక చేసుకుని తీసుకున్న నిర్ణయాలలో ఓ గొప్ప నిర్ణయమే ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి గారితో నా ప్రస్థానానికి నాంది. దాదాపు పాతికేళ్ల పాటు ఆయనతో నా ప్రయాణం, ఆయనతో మెలిగిన సుదీర్ఘ అనుభవం నా వ్యక్తిత్వంలోను, నా మనస్తత్వం లోనూ ఎన్నో మంచి మార్పులకు దోహదం చేసింది. ఆయనతో గడిపిన అమూల్యమైన సమయాన్ని వర్ణించడానికి నా దగ్గర మాటలు లేవు.

క్రమశిక్షణ, కష్టపడి అనుకున్నది సాధించడం వంటి అంశాలను ఆయనలో దగ్గరగా చూసి ఎన్నో విషయాలను నేర్చుకుని నన్ను నేను మనిషిగా మలచుకున్నాను. ఈరోజు నేను ఏ ఉన్నత స్థితిలో వున్నా నా అభ్యున్నతికి ఈనాటి నా ఈ స్థితికి ముమ్మాటికీ ఆయనే నాకు స్ఫూర్తి. నేను బట్రాజును కాదు.. నాకు పొగడ్తలు రావు, కాని ఒక్క విషయం మాత్రం చెప్పగలను. ఆయన గురించి ఎవరో ఒక్క మాటలో చెప్పమంటే ఇలా చెప్పినట్లు గుర్తు... “నేను పెద్దగా మతతత్వవాదిని కాదు, గుళ్ళు గోపురాలకు పెద్దగా వెళ్ళను, అయితే ఎందుకంటే నిత్యం నా కళ్లెదురుగా వుండే నాయుడు గార్నే నేను దేవుడిగా చూసేవాడిని, అందుకే ఆయన నాకు ‘కనిపించే దైవం’”.

గత వారం నేనో కష్టతరమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నాను. ఈ తరుణంలో భారత ఉపరాష్ట్రపతికి ప్రత్యేక అధికారిగా నా పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. నా అభిప్రాయాన్ని, నిర్ణయాన్ని ఆయనకు చెప్పవలసి వచ్చింది. నా జీవితంలో ఇంతటి ఇబ్బందికర పరిస్థితి ఎప్పుడు నాకు రాలేదు. ఆయన ఎంతో అభిమానంతో నా నిర్ణయాన్ని అర్థం చేసుకుని అందుకుగల కారణాలను కూడా అవగతం చేసుకుని నన్ను ఆశీర్వదించారు. ఆ వెంటనే నా రాజీనామా ఆమోదించడం నేను ప్రత్యేక అధికారి పదవి నుండి తప్పుకోవడం జరిగిపోయాయి.

నేను ఇప్పుడు భారతీయ జనతాపార్టీకి అంకితభావం కలిగిన ఓ కార్యకర్తని. నేను కళాశాల విద్యార్థిగా వున్న రోజుల నుండే నాకు పార్టీతో అనుబంధం ఏర్పడింది. అప్పట్లో నేను చిత్తశుద్ధి కలిగిన ఏబివిపి కార్యకర్తని. వెంకయ్యనాయుడు గారిని తొలిసారిగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా భారతీయ జనతా పార్టీ నియమించినప్పుడు, ఆయన తన కోసం అలాగే పార్టీ కోసం పూర్తి సమయం పనిచేయగల ఓ సమర్ధవంతమైన ఏబివిపి కార్యకర్త కోసం వెతుకుతున్నారు. ఆ సమయంలో నా అదృష్టం కొద్దీ ఆయన కళ్ళల్లో నేను పడడం, వెంటనే ఆయన నన్ను తన దగ్గర చేర్చుకోవడం జరిగిపోయింది. ఈ అనుబంధం, ఆత్మీయ బంధం దాదాపు పాతికేళ్ల పాటు కొనసాగింది. ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో నేను ఎన్నో విలువైన విషయాల్ని నేర్చుకుని నా జీవితాన్ని మలుచుకున్నాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో సంస్థాపరంగా కానీ, పార్టీ పరంగా కానీ, పార్లమెంటు వ్యవహారాలలో కానీ, ప్రభుత్వ సంబంధిత పనులలో కానీ లేదా ఆయన వ్యక్తిగత విషయాలలో కానీ నాకు చేతనైన వరకు శక్తివంచన లేకుండా పనిచేసి ఆయనకు ఉపక రించడంలో నా బాధ్యతను ఎప్పుడూ విస్మరించలేదు. ఇక నేనిప్పుడు నా మాతృ సంస్థకు వచ్చేసాను. వెంకయ్యగారి ఆశీస్సులతో పూర్తిస్థాయి కార్యకర్తగా పని చేయాలనుకుంటున్నాను.

“కృతజ్ఞత అన్నది ఓ అనుభూతి, అది ఓ భావోద్వేగంతో కూడిన మాటలలో చెప్పలేని భావన”. ఎంతో కృతజ్ఞతతో నేను ఆయనకి రుణపడి వున్నాను. ఈరోజు నా ఈ ఉన్నతికి ఎన్నటికీ కారణం ఆయనే. నేనెప్పటికీ ఆయనకి బద్ధుడనై వుంటాను. ఉషమ్మ గారు, హర్ష, రాధమ్మ, దీపమ్మ, వెంకట్ గారు, ఇతర కుటుంబసభ్యులతో పాటు నాయుడు గారి మిత్రులు, పార్టీ సభ్యులు, సహచరులు అందరూ నన్నెప్పుడూ ఓ కుటుంబ సభ్యుడిగానే చూశారు. అన్ని వేళల్లో వారందించిన మద్దతు, స్ఫూర్తి ప్రతి క్లిష్ట సమయంలో ఇచ్చిన చేయూత నా జీవితంలో విలువైనవి. వారి ప్రేమానురాగాలతో తన్మయత్వం చెందాను. నా హృదయాంతరాల్లో నుండి వారందరికీ నా ధన్యవాదాలు. నాకు పిల్లలతో గట్టి బంధం వుంది. విష్ణు, నిహారిక, సుష్మ, వైష్ణవి మేమందరం మిత్రుల్లా వుండేవాళ్ళం. ఒకరి అనుభూతులను ఒకరం పంచుకునేవాళ్ళం. ఎంతో సహజంగా కలిసిపోయే వాళ్ళం. కొలబద్ధత లేని వారి ప్రేమాభిమానాలు ఎన్నోసార్లు నా హృదయాన్ని తాకాయి. వారందరికీ నా హృదయపూర్వక ఆశీస్సులు.

నాయుడు గారు ఆయన అమూల్యమైన ఆశీస్సులతో ఇన్నాళ్ళు నన్ను ముందుకు నడిపించారు. ఒక స్ఫూర్తి ప్రదాతగా, ఒక దిక్సూచిగా, ఓ మార్గదర్శకుడిలా నాకు దశా దిశా నిర్దేశించారు. ఆయనకి ఆయురారోగ్యాలతో కూడిన నిండు జీవితం ప్రసాదించాలని, ఆ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

- వై.సత్యకుమార్
భారతీయ జనతాపార్టీ కార్యకర్త.

## కార్తీక మాసోత్సవాలకు శివాలయం ముస్తాబు



కార్తీక మాసం అంటేనే నెల్లూరులో గుర్తొచ్చేది మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవాలయం. కార్తీక మాసంలో ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా మూలస్థానేశ్వరుడిని దర్శించుకుని దీపం వెలిగిస్తుంటారు. ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభమయ్యే కార్తీక మాసోత్సవాలకు మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి నేతృత్వాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాన్ని 11వ తేదీ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు ఆర్డీఓ హరిత, ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహరావు, కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్‌యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, ఇ.ఓ పాయసం సుబ్రహ్మణ్యంలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై మేయర్, ఆర్డీఓలు అధికారులతో చర్చించారు. ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా వెయ్యి మంది భక్తులు శివ మాలలు ధరిస్తారని, శివదీక్షలు చేపట్టే భక్తులకు ఉచితంగా మాలలు, దుస్తులు, సాయంత్రం అల్పాహారం అందజేయనున్నామని చెప్పారు. ఈ నెల 20వ తేదీ నుండి నవంబర్ 18వ తేదీ వరకు శివదీక్షలు జరుగుతాయని, శివదీక్ష చేపట్టాలనుకున్న భక్తులు ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. నవంబర్ 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిరంతరాయంగా శివ పంచాక్షరి పారాయణం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## బిజిఆర్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాస రచన, పద్యపఠన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు 12వ తేదీన కళాశాల కరస్పాండెంట్ జె.వి.రెడ్డి తన కుమారుడు కీర్తిశేషులు జక్కా హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థంగా నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జె.వి.రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గాంధీజీ సూచించిన మార్గంలో నడవాలని, ఆయన ఆశయాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మృదుల, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# దిద్దు'బాటు'లో జీఎస్టీ

**'ఒకే దేశం..ఒకే పన్నుల విధానం' అనే బృహత్సంకల్పంతో వచ్చిన జీఎస్టీ ఇంకా బాలారిష్టాల దశను దాటలేకపోతోంది. దీంతో జీఎస్టీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎలాంటి బింకానికి పోకుండా నేరుగా దిద్దుబాటు చర్యలకు దిగడం సంతోషకరం. ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా జీఎస్టీలో లోటుపాట్లను చక్కదిద్దుతూ, నిబంధనలను సడలిస్తూ.. ప్రభుత్వం సరైన సరళీకృత నిర్ణయాలు తీసుకోవడం ఎంతైనా హర్షదాయకం.**

**'ఒకే దేశం.. ఒకే పన్నుల విధానం'** అనే బృహత్సంకల్పంతో పరోక్ష పన్నుల వ్యవస్థలో సంస్కరణలను లక్ష్యంగా తీసుకుని, ఏకరూపతను-పారదర్శకతను సాధించాలనే సదాశయంతో జీఎస్టీ విధానానికి రూపకల్పన జరిగింది. మూడు నెలల క్రితం మోడీ ప్రభుత్వం ఎంతో సాహసోపేతంగా దీనిని అమలులోకి తీసుకురావడం, స్వతంత్ర్య భారత చరిత్రలోనే తొలి బృహత్కరమైన ఆర్థిక సంస్కరణగా జీఎస్టీకి శ్రీకారం చుట్టడం ఎంతైనా హర్షదాయకం. అయితే, ఈ పథకం ఇంకా బాలారిష్టాల దశను దాటకపోవడంతో జీఎస్టీ ఇంకా తప్పటడుగులు వేస్తూనే ఉంది. అయినా, ఇంత పెద్ద దేశంలో ఏ కొత్త సంస్కరణ ప్రవేశపెట్టినా అది సజావుగా అమలులోకి రావాలంటే ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులు ఎదురవుతుండడం సహజం. వాటన్నిటినీ సంయమనంతో పరిశీలించి, సమస్యలను అధిగమించడానికి తగ్గ విధానాలను ఎప్పటికప్పుడు అవలంభించకుంటే అనుకున్న లక్ష్యం సాధించలేం. అందుకే, ప్రభుత్వం ఇప్పుడు జీఎస్టీపై సరికొత్త సరళీకృతవిధానాలతో దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. ఈ తాజా విధానాలు అందరికీ అమోదయోగ్యంగా ఉంటున్నాయి కూడా. జీఎస్టీపై ఎడతెరపిలేకుండా వస్తున్న విమర్శలను, ఈ పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, ఈ పథకం మరింత సవ్యంగా సాగేందుకు ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. తాజాగా జీఎస్టీకి చేసిన మార్పులు, చేర్పులు కొత్త పన్నుల వ్యవస్థపై వ్యాపారవర్గాల్లో.. ప్రజల్లో రేకెత్తుతున్న అసంతృప్తిని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలుగానే భావించవచ్చు. ఈ దశలో అది అవసరం కూడా. అందుకే ప్రభుత్వం సత్వరం దిద్దుబాటు చర్యలకు దిగింది. తొలుత, జీఎస్టీ పట్ల విమర్శలు ఎదురైనా ప్రభుత్వం ఎదురొడ్డి నిలిచింది. జీఎస్టీ వచ్చాక 27 రకాల వస్తువులు, 12 సేవలపై పన్నురేట్ల కుదింపు మంచిదే అనే అభిప్రాయం ప్రజల్లో సర్వత్రా వినిపించింది. అదేవిధంగా, తొలినెలలోనే వేలాది కోట్ల రూపాయల పన్నుల రాబడి రావడంతో జీఎస్టీ ఘనవిజయం సాధించిందనే అందరూ భావించారు. అయితే, దీనిలో అత్యధికశాతం పన్ను రిఫండ్ క్లైమ్‌లు కూడా దాఖలైన విషయం ప్రస్తావించలేదనే విమర్శలు కూడా వచ్చాయి. తొలినుంచి నిపుణులు హెచ్చరిస్తున్నా లెక్కచేయకుండా గత జూలై 1 నుంచి జీఎస్టీని అసమగ్ర స్వరూపంగానే అమలులోకి తీసుకురావడంతో ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురైందనే విశ్లేషణలు ఊపందుకుంటున్నాయి. సంక్లిష్టమైన పన్ను రేట్లు, పనిచేయని సాంకేతిక నెట్‌వర్క్‌లు వగైరాలు జీఎస్టీ పట్ల అసమ్మతిని రాజేస్తున్నాయనే విమర్శలను కాదనలేం. ప్రధానంగా జీఎస్టీ పట్ల అసంఘటిత రంగంలో అసంతృప్తి వెల్లువలా ఉంది. అస్తవ్యస్తంగా వచ్చిన ఈ జీఎస్టీ తమ జీవనానికి ఎంతో ఇబ్బందిగా ఉందని వారు భావించే స్థితిదాకా వచ్చింది. అదేవిధంగా, చేతివృత్తులవారు, చిన్నచిన్న వ్యాపారులకు, సాంకేతికపరిజ్ఞానం లేని సామాన్య వ్యాపారులకు జీఎస్టీ పట్ల సమగ్రమైన అవగాహన కల్పించలేకపోవడం మూలంగా, వారికిది మరింత శిరోభారమైంది. ఈ నేపథ్యంలో, జీఎస్టీ వస్తే ధరలు బాగా తగ్గిపోతాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న పేద, మధ్య తరగతి ప్రజానీకానికి అసలు ఏ ధరలు తగ్గాయో కూడా తెలియడం లేదు. జీఎస్టీ పేరుతో వస్తువుల ధరలు ఆకాశానికి అంటిపోయాయనే మాటే సర్వత్రా వినిపిస్తోంది. ఏఏ వస్తువులపై ఎంతెంత పన్ను విధించారో తెలిపే బోర్డులు సైతం ఎక్కడా కనిపించడం లేదు. వస్తువులపై రాయితీ ఉన్నప్పటికీ, అసలు ధరపై పన్ను కట్టాల్సివస్తోందంటూ జీఎస్టీని బూచిగా చూపి వినియోగదారుల ముక్కు పిండుతున్న సంఘటనలు కోకొల్లలు. దీంతో జీఎస్టీ వంటి మంచి పథకం కూడా విమర్శల పాలవుతోంది. అయితే, ఈ విమర్శలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే కదిలి జీఎస్టీ అమలులో వస్తున్న ఇబ్బందులను సమీక్షించడం, సమస్యలను పరిష్కరించడానికి సమాయత్తం కావడం శుభపరిణామమే. జీఎస్టీలో పన్ను చెల్లింపులు, రిటర్ను దాఖలు విధివిధానాలు సంక్లిష్టంగా ఉన్నాయంటూ చిన్నస్థాయి, మధ్య స్థాయి వర్తకులు ఆవేదన చెందుతున్న నేపథ్యంలో, వాటిని సరళీకృతం చేస్తూ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తగు నిర్ణయాలు తీసుకోవడం పట్ల సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. వివిధ శ్లాబుల్లో ఉన్న 27 రకాల వస్తువుల పన్ను రేట్లు తగ్గించారు కూడా. అంతేకాదు, కోటిన్నర లోపల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారసంస్థలు ఇకపై ప్రతినెలా కాకుండా, మూడు నెలలకోసారి పన్ను చెల్లించడంతో పాటు, రిటర్న్‌లు దాఖలు చేసే వెసులుబాటు కల్పించడం వ్యాపారులకు ఊరట కలిగించే విషయమే. అదేవిధంగా ఎగుమతిదారులకు కూడా నిబంధనలు సడలించారు. ఇలా తాజాగా తీసుకున్న పలు నిర్ణయాలతో జీఎస్టీ మరింత సులభతరం అయ్యేందుకు మార్గం వేసినట్లయింది. తాజాగా జీఎస్టీ మండలి తీసుకున్న నిర్ణయాలతో వస్తు సేవల పన్ను చెల్లింపు మరింత సులభతరమైందని, ఈ తాజా సిఫార్సుల వల్ల ప్రజలకు, చిన్న, మధ్య తరగతి వ్యాపారస్తులకు లబ్ది కలగడంతో పాటు, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి చెందేందుకు దోహదపడుతుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఏదేమైనా, ఒక మంచి పథకాన్ని..లేదా సంస్కరణను దేశవ్యాప్తంగా అమలుచేయాలంటే ఎంతో కష్టం. అయినా, ఆ పథకం అమలులో వచ్చిన లోటుపాట్లను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవడం హర్షదాయకం. ఇందుకు ఒక అడుగు వెనుకకు వేసినట్లు అనిపించినా, ఇలాంటి తాజా నిర్ణయాలతో ప్రభుత్వం పారదర్శకంగా మరో ముందడుగు వేసినట్లుగానే భావించవచ్చు. అటు ప్రజల సంక్షేమాన్ని, ఇటు దేశసౌభాగ్యాన్ని పరిరక్షిస్తూ తీసుకునే ఇలాంటి నిర్ణయాలను ఎవరైనా సరే హృదయపూర్వకంగానే స్వాగతిస్తారు.

ఏదేమైనా, ఈ దిద్దుబాటు చర్యలతోనైనా.. జీఎస్టీ ప్రజలందరి ఆకాంక్షలకు తగ్గట్టుగా మరింత సరళీకృతంగా, సక్రమంగా, సమగ్రంగా.. సమర్థవంతంగా అమలులోకి వచ్చి.. ఈ బృహత్ సంస్కరణ విజయవంతమవుతుందని ఆశిద్దాం!

# 'పురుషోత్తమ విజయం' పుస్తకావిష్కరణ



మధురకవి బిరుదవోలు రామిరెడ్డి రచించిన 'పురుషోత్తమ విజయం' పుస్తకావిష్కరణ నెల్లూరు శ్రీ వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 7వతేదీ నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని ఆర్.ఎల్.రెడ్డి సమావేశం మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా హంస అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రకాశనం అనంతరం రంగస్థల కళాకారుడు టి.వి.రమణారావు ప్రార్థనాగీతంతో సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పురుషోత్తమ విజయం పుస్తకావిష్కరణను ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం గావించగా, శ్రీ వర్ధమాన సమాజం ఉపాధ్యక్షులు మోపూరు వేణుగోపాలయ్య సమీక్షించారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రామిరెడ్డి పురుషోత్తముడని, అతనికి నిరంతరం విజయమేనని కొనియాడారు. సభా కార్యక్రమ నిర్వహణను నటభాస్కర బిరుదాంకితులు వల్లకవి వేంకటసుబ్బారావు నిర్వహించారు. పుస్తక సమీక్షకులు మోపూరు వేణుగోపాలయ్యను, పుస్తక రచయిత బిరుదవోలు రామిరెడ్డిని, ప్రముఖ రంగస్థల కళాకారుడు టి.వి.రమణరావును సంస్థ తరపున ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు ఒంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, తుంగా నారాయణరెడ్డి, చెలంచర్ల భాస్కరరెడ్డి, పెళ్ళూరు సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిదర్బార్ ఆధ్వర్యంలో సామూహిక షిర్డీ యాత్ర

నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి 250 మంది సాయినాధుని భక్తులు సామూహిక షిర్డీయాత్రకు బయలుదేరివెళ్ళారు. ఈ నెల 8వ తేది ఉదయం సాయినాధునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులంతా బయలుదేరారు. ఈ సందర్భంగా సాయినాధుని మాలధారణ చేసిన భక్తులు ఇరుముడులు ధరించారు. సాయినామ సంకీర్తనలతో, భజనలతో మందిర ప్రాంగణమంతా సందడిగా మారింది. సాయిదర్బార్ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ, సాయిభక్తులకు షిర్డీ గురు స్థానమని, సాయినాధుని దర్శనం భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తుందన్నారు. సాయినాధుని దర్శనం చేసుకున్నాక షిర్డీలో సత్సంగం నిర్వహించి, భజనలు, పల్లకీ ఉత్సవంలో పాల్గొంటామని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ఇక్కడినుంచి షిర్డీకి ఈ యాత్రను నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా ఈ యాత్రకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండడం ఎంతో సంతోషదాయకమని అన్నారు.




# ఒత్తిడి చదువులు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ర్యాంకులు, మార్కులే ఈరోజు చదువుల్లో ప్రతిభకు కొలమానంగా చూస్తున్నారు. ర్యాంకుల వేటలో పడ్డ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తెల్లారింది మొదలుకొని అర్థరాత్రి దాకా చదువుల పేరుతో ప్రత్యేక క్లాసుల పేరుతో హింసిస్తున్నాయి. కొందరు విద్యార్థులు ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. తమ బిడ్డలు ఎక్కడ చదువుల్లో వెనుకబడిపోతారోననే భ్రమలో తల్లిదండ్రులు కూడా వారి మానసిక ఒత్తడిని గుర్తించలేకపోతున్నారు. విద్యార్థులు అటు విద్యాసంస్థల ఒత్తిడిని తట్టుకోలేక, ఇటు తల్లిదండ్రులకు చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థులకు నిర్వహించే తరగతులు, స్టడీ హవర్స్‌పై ప్రభుత్వమే ఒక టైంటేబుల్ తీసుకురావాలి.

**మక్కెస సుప్రజ, నెల్లూరు.**

# ప్రధానికి కృతజ్ఞతలు

దేశంలో నిరుపేదలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించే సౌభాగ్య పథకం ప్రకటించిన ప్రధాని నరేంద్రమోడీకి కృతజ్ఞతలు. దేశంలోని 4కోట్ల బిపిఎల్ కుటుంబాలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. వారి జీవితాలలో వెలుగులు నింపుతోంది. దళిత, గిరిజన కుటుంబాలకు 120రూపాయలకే దీనదయాళ్ పథకం క్రింద విద్యుత్ కనెక్షన్లు గతంలోనే ప్రవేశపెట్టారు. గత మూడేళ్లుగా దళిత, పేదల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్న ప్రధాని మోడీ అందరికీ ఆదర్శప్రాయులు.

**– ఎస్.బాబూరావు, కావలి.**

# పన్నులు చెల్లించేవారిని పెంచండి

ఈ దేశంలో ప్రధాన దౌర్భాగ్యం పద్ధతిగా పన్నులు కట్టే వాళ్ళనే మళ్ళీ మళ్ళీ బాదడం. పన్నులు కట్టేవాడిపైనే పన్నులు పెంచితే వాళ్ళు పన్నులు ఎగ్గొట్టే మార్గాలు ఆలోచిస్తారు. ఇప్పటివరకు పన్నులు కట్టనివాళ్లను పన్నులు కట్టే మార్గంలోకి తీసుకురావాలి. నెలకు పది, పదిహేను వేల జీతం తీసుకునే వాళ్ళను కూడా పన్నుల చట్రంలోకి తీసుకురావాలి. అయితే ఇది 30శాతం పన్నువసూలు చేసేటట్లు కాదు, 5 శాతమో, 6 శాతమో వుండాలి. వచ్చే ఆదాయాన్ని బట్టి పన్ను శాతం వుండాలి. పన్నులు చెల్లించడాన్ని ప్రజలు ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. అలా వుండాలంటే పన్నుల విధానాన్ని సరళం చేయాలి. పన్నులు చెల్లించే వాళ్ళను పెంచాలి. పన్నులు చెల్లించడాన్ని ఈ దేశం పట్ల బాధ్యతగా చూపాలేగాని భారంగా భావించకూడదు.

**కె.దయాకర్‌రెడ్డి, నెల్లూరు.**

# గెలుపు... పజిల్



## జిల్లాలో నానాటికీ బలహీనపడుతున్న బీజేపీ

***గెలుపు వారికి ఒక మిస్టరీగానే వుంది. గెలుపు కేవలం హిస్టరీకే పరిమితమైంది. గెలుపు ఆ పార్టీకి అందని ద్రాక్ష పండుగానే మారింది. నెల్లూరుజిల్లాలో భారతీయ జనతాపార్టీ దుస్థితి ఇది. ఉప రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నిన్నటివరకు ఆ పార్టీ నాయకుడైన యం.వెంకయ్య నాయుడు ఈ జిల్లావాడే! కాని ఆయన ఎదిగినంత వేగంగా ఇక్కడ పార్టీ ఎదగ లేకపోయింది.***

బీజేపీ చరిత్రలో నెల్లూరుజిల్లా నుండి బీజేపీకి లభించిన ఒకే ఒక విజయం 1983 ఎన్నికల్లో ఉదయగిరి అసెంబ్లీ నుండి ఆ పార్టీ అభ్యర్థిగా వెంకయ్య నాయుడు గెలవడం. ఆ తర్వాత ఆ పార్టీకి గెలుపున్నదే లేదు. 1985 ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తుతో భాగంగా వెంకయ్యానాయుడు ఆత్మకూరు నుండి పోటీ చేసి ఓడిపోయాడు. 1989లో ఇదే ఆత్మకూరు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన కర్నాటి ఆంజనేయరెడ్డి ఓడిపోయాడు. 1994 ఎన్నికల్లో పొత్తు లేకుండానే జిల్లాలో పలు అసెంబ్లీలకు, లోక్‌సభకు పోటీ చేసినా డిపాజిట్లు కూడా తెచ్చుకోలేకపోయారు. 1999 ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన దేగా నరసింహారెడ్డి ఓడిపోయాడు. 2004 ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ నుండి పోటీ చేసిన బొల్లినేని కృష్ణయ్యలు కూడా ఓడిపోయారు. అలాగే నెల్లూరు పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాల కొండయ్య పరాజయం పాలు కావడం తెలిసిందే! 2009 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే లోక్‌సభకు, కొన్ని అసెంబ్లీలకు పోటీ చేసినా డిపాజిట్లు కూడా రాలేదు. 2014 ఎన్నికల్లో మళ్ళీ తెలుగుదేశంతో పొత్తు కుదిరి నెల్లూరురూరల్ స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి పోటీ చేశాడు. వైకాపా అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యాడు.

నెల్లూరుజిల్లా చరిత్రలో బీజేపీది అంతా పరాజయం పరంపరే! పొత్తులో పోటీ చేసినా ఒంటరిగా పోటీ చేసినా ఆ పార్టీ బలంగా కనిపించిందెప్పుడూ లేదు. 1983 నుండి జిల్లాలో పార్టీ క్రమక్రమంగా బలహీనపడుతూ వస్తోంది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్, టీడీపీ, వైసిపి వంటి ప్రత్యామ్నాయ పార్టీలను చూసుకుంటూ వచ్చారు. జిల్లాలో పార్టీ బలపడడానికి ఆ పార్టీ నాయకులు ప్రత్యేకంగా తీసుకుంటున్న శ్రద్ధ కూడా ఏదీ లేదు. మరీముఖ్యంగా తెలుగుదేశంతో పొత్తు వున్న కాలం నుండి చూస్తుంటే వారి పని వెంకయ్యానాయుడుతో పాటు ఢిల్లీ నుండి బీజేపీ నాయకులు వస్తుంటే, ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీలు, జెండాలు కట్టడం, ర్యాలీలు నిర్వహించడం. ఇతర రాష్ట్రాలలో బీజేపీ గెలిచినప్పుడు పార్టీ కార్యాలయం వద్ద ఔట్లు కాల్చి, స్వీట్లు పంచుకోవడం. ఇంతకుమించి పార్టీ పటిష్టతకు వాళ్ళు తీసుకుంటున్న చర్యలేమీ లేవు. వాళ్లకంటే కమ్యూనిష్టులు నయం. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అప్పుడప్పుడూ రోడ్లెక్కి ధర్నాలు, రాస్తారోకోలన్నా చేస్తున్నారు. కాని జిల్లాలో బీజేపీ వాళ్ళు మాత్రం ప్రజాసమస్యలపై పోరాటం అనే మాటనే మరిచారు.

# 'లోక్‌సభ' లో సైకిల్ వీక్

## • ఈసారన్నా కొట్టాలి





***ఏపిలో ఎక్కడైనా తెలుగుదేశంపార్టీకి తిరుగుండదేమో... ఒకసారి ఓడిన చోట మరోసారైనా గెలుస్తుందేమో... కాని రాష్ట్రంలో కడప తర్వాత తెలుగుదేశంకు మింగుడుపడని నియోజకవర్గం నెల్లూరే! అది లోక్‌సభ అయినా శాసనసభ అయినా?***

తెలుగుదేశం ఆవిర్భవించాక ఇప్పటివరకు 7సార్లు అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే తెలుగుదేశంపార్టీ గెలిచింది రెండే రెండుసార్లు. 1983లో ఆనం రామనారాయణరెడ్డి, 1994లో టి.రమేష్‌రెడ్డిలు మాత్రమే తెలుగుదేశం అభ్యర్థులుగా ఇక్కడ గెలవగలిగారు. ఇక తెలుగుదేశంపార్టీ ఆవిర్భవించాక 9సార్లు పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. 2012లో జరిగిన ఉపఎన్నికను కలిపితే నెల్లూరు పార్లమెంటుకు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. కేవలం రెండంటే రెండుసార్లు మాత్రమే నెల్లూరు పార్లమెంటులో తెలుగుదేశం గెలిచింది. 1985ఎన్నికల్లో పుచ్చులపల్లి పెంచలయ్య, 1999ఎన్నికల్లో ఉక్కాల రాజేశ్వరమ్మలు తెలుగుదేశం అభ్యర్థులుగా విజయం సాధించగలిగారు. ఈ పదింటిలో 6సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, 2సార్లు వైకాపా అభ్యర్థి విజయం సాధించగలిగారు. 2009లో నెల్లూరు లోక్‌సభ రిజర్వ్‌డ్ కేటగిరిలో నుండి జనరల్‌లోకి మారింది. అయినా కూడా తెలుగుదేశం పరిస్థితి మారలేదు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలతో పాటు నెల్లూరు లోక్‌సభలోనూ తెలుగుదేశం బలహీనంగానే వుంది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని దించింది. ఆయన గట్టి పోటీయే ఇచ్చాడు. గెలుపుకు కొద్ది తేడాతో మిస్సయ్యాడు.

కేంద్రంలో పట్టు నిలుపుకోవాలంటే అసెంబ్లీలో మెజార్టీని సాధించడంతో పాటు అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవాలి. 2014 ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రావడంతో చంద్రబాబును మోడీ వేలిమీద వెంట్రుకతో సమానంగా చూసాడు. కాని, వచ్చే ఎన్నికల్లో అంత స్వీప్ పరిస్థితి వుండదు. మిత్రపక్షాల ఎంపీ స్థానాలపై ఆధారపడాల్సి వుంటుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ ఎంపీ స్థానాలను సాధించడం ముఖ్యమే! ఈ దృష్టిలోనే తెలుగుదేశంకు మింగడుపడకుండా వున్న నెల్లూరు లోక్‌సభపై చంద్రబాబు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వైకాపాను ఎదుర్కొనే ధీటైన అభ్యర్థికై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## • అమరావతి

# నూతన ఛాంబర్‌లో సోమిరెడ్డి



రాజధాని అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 2వ బ్లాక్‌లోని మొదటి అంతస్తులో గల కొత్త ఛాంబర్ నెంబర్ 208లో ఈనెల 6వతేదీ ఉదయం 8.01గంటలకు పాదం మోపారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన ఛాంబర్‌లోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన టీడీపీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, బీజేపీ నాయకులు, పలువురు చంద్రమోహన్‌రెడ్డి అభిమానులు, జిల్లా మరియు రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొని చంద్రమోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రాత్రనకా పగలనకా కష్టపడుతూ అటు కడప, ఇటు నెల్లూరు జిల్లాలలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు రాష్ట్రస్థాయిలో వ్యవసాయానికి సంబంధించిన వ్యవహారాలలో పూర్తి సమయాన్ని వెచ్చిస్తున్న సోమిరెడ్డి తన నూతన కార్యాలయం నుండి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని వచ్చిన ప్రతిఒక్కరూ ఆయనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

## ప్రత్యామ్నాయ మార్గంతో...

# ప్రమాదాలు తగ్గుతాయి




రాష్ట్రంలో అత్యంత రద్దీ వున్న రహదారుల్లో ఒకటి నాయుడుపేట – పూతలపట్టు రోడ్డు. అత్యంత ప్రమాదకరమైన రహదారి కూడా ఇదే! ఈ రోడ్డు మీద యాక్సిడెంట్ కాని రోజంటూ ఉండదు. రోజుకు కొన్ని వేల వాహనాలు ఈ రోడ్డు మీద ప్రయాణిస్తుంటాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, కంచి వంటి పుణ్యక్షేత్రాలను కలిపే రహదారి ఇది. ఇక ఏపిలోని కోస్తా జిల్లాల ప్రజలందరు కూడా బెంగుళూరుకు వెళ్లాలంటే ప్రయాణించాల్సింది ఈ రోడ్డు మార్గాన్నే! ఇంత రద్దీ, ఇంత ప్రాధాన్యతగల రోడ్డును పదేళ్ళ క్రితమే నాలుగులైన్ల రహదారిగా మార్చివుండాలి. దివంగత నేత వై.యస్. హయాంలోనే నాయుడుపేట–పూతలపట్టు మధ్య రోడ్డును నాలుగులైన్లుగా మార్చాలనుకున్నా, స్థానికంగా కొందరు నేతల స్వార్థ ఆలోచనల వల్ల ఆ ప్రతిపాదన అటకెక్కింది. వై.యస్. హయాంలోనే ఈ రోడ్డును జాతీయ రహదారుల్లో చేర్చారు. కాని, రోడ్డు విస్తరణ మాత్రం ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ఈ రహదారిని 6లైన్ల రహదారిగా మార్చాలని, 2020లోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నాయుడుపేట నుండి కర్నాటక సరిహద్దు ములాబాగిల్ వరకు 6లైన్లుగా ఈ రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు.

శ్రీకాళహస్తి, తిరుపతిలకు వెళ్లే వాహనదారులు అందరూ నాయుడుపేట మార్గాన్నే ఎంచుకుంటున్నారు. దీనివల్ల ఆ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రయాణం నరకయాతనగా వుంది. తిరుపతికి మరో ప్రత్యామ్నాయంగా గూడూరు, వెంకటగిరి, ఏర్పేడు రోడ్డు వుంది. జాతీయ రహదారి నుండి గూడూరు పట్టణంలో గుండా వెళ్లి వెంకటగిరి మీదుగా తిరుపతి వెళ్లొచ్చు. ఈ రోడ్డు డబుల్ లైన్ అయినప్పటికి ట్రాఫిక్ రద్దీ అంతగా లేదు. రోడ్డు కూడా బాగుంది. తిరుపతికి వెళ్లే వాహనదారులకు ఇది ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. రేపు నాయుడుపేట, తిరుపతి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు వెంకటగిరిరోడ్డును వాడుకోవచ్చు. కాబట్టి తిరుపతి వెళ్లే వాహన దారులకు వెంకటగిరి రోడ్డుపై అవగాహన కల్పించాలి.



# నెల్లూరు కబుర్లు

## పీసీసీలో నెల్లూరోళ్ళు

నెల్లూరుజిల్లాకు చెందిన 12మంది కాంగ్రెస్ నాయకులకు పీసీసీలో సభ్యులుగా అవకాశం వచ్చింది. 10వ తేదీ విజయవాడలో కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 273మందిని పీసీసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నెల్లూరుజిల్లా నుండి పనబాక కృష్ణయ్య, సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, పత్తి సీతారాంబాబు, శివాచారి, తిరుపతయ్య, జిలాని బాషాలు పీసీసీ సభ్యులుగా నియమితులయ్యారు. ఎన్నికైన సభ్యులను రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పరిశీలకులు మునియప్ప, మాజీకేంద్రమంత్రి పనబాక లక్ష్మిలు అభినందించారు.

## సిఎంఆర్ వీక్లీ డ్రా విజేత అర్చన



నెల్లూరులోని ప్రముఖమైన సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఈ నెల 8న ఫిదా సేల్ లక్కీ డ్రాను నిర్వహించారు. మాజీమంత్రి, టిడిపి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకరరెడ్డి ఈ వీక్లీ డ్రా తీయగా నవాబుపేటకు చెందిన అర్చన విజేతగా నిలిచి స్కూటీపెప్‌ను బహుమతిగా పొందారు. ప్రతిరోజు నిర్వహించిన డ్రా విజేతలకు కూడా ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, పేర్నేటి కోటీశ్వర్‌రెడ్డి, మన్నెం పెంచలయ్య, సిఎంఆర్ అధినేత శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత పెంచలయ్య పాల్గొన్నారు.

## ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

### వైఎస్సార్‌సిపి విద్యార్థి విభాగం డిమాండ్




కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో కమిటీ నియమించి విచారణ జరిపించాలని వైఎస్సార్‌సిపి విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. స్థానిక మాగుంట లే-అవుట్‌లోని వైఎస్సార్‌సిపి జిల్లా కార్యాలయంలో ఈనెల 7న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కడపలోని నారాయణ కళాశాలలో విద్యార్థిని పావని ఆత్మహత్య విషయం ఆమె తల్లితండ్రులకు తెలియజేయకుండా పోలీసుల ఆధ్వర్యంలో మార్చురీకి తరలించడం చూస్తుంటే అక్కడి అధ్యాపకులు, సిబ్బంది పనితీరు అర్థమవుతోందన్నారు. గతంలో ఇదే కళాశాలలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అంటూ, మంత్రి నారాయణ కానీ, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కానీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి కార్పొరేట్ కాలేజీలో ఒక సైక్రియాట్రిస్టును నియమించి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారిలో మనోధైర్యాన్ని నింపే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆత్మహత్యలపై విచారణ జరిపించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో శ్రావణ్‌కుమార్‌తో పాటు, వైఎస్సార్‌సిపి విద్యార్థి విభాగం నాయకులు హరికృష్ణ, వినీల్, సరేష్, కుష్కాల్ తదితరులు పాల్గొన్నారు.

## పనబాక లక్ష్మి జన్మదినోత్సవం

మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పనబాక లక్ష్మి జన్మదిన వేడుకలు ఈ నెల 6న ఘనంగా జరిగాయి. నగరంలోని ఇందిరాభవన్‌లోను, మినీబైపాస్‌రోడ్డులో ఉన్న పనబాక కార్యాలయం వద్ద ఈ వేడుకలు జరిగాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్‌చేసి, అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు చెంచలబాబుయాదవ్, దేవకుమార్‌రెడ్డి, పత్తి సీతారాంబాబు, శివాచారి తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రమంత్రిగా ప్రజలకు, పార్టీకి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు భవాని నాగేంద్ర ప్రసాద్, సుమన్, ఫయాజ్, అనూరాధారెడ్డి, కేశవనారాయణ, ముమిత్‌షా, చెంచుకిషోర్, మంజుల, అరవ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్‌రెడ్డికి ఎంపీ సంఘీభావం



ప్రజాబాటలో ఉన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తన సంఘీభావం ప్రకటిస్తూ, శ్రీధర్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మన ఎమ్మెల్యే..మన ఇంటికి' కార్యక్రమాన్ని ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అభినందించారు. సోమవారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఉప్పుటూరు పర్యటనలో ఉండగా, ఎంపీ అక్కడికి వెళ్ళి శ్రీధర్‌రెడ్డిని అభినందించారు. శ్రీధర్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్ళి అక్కడి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఎన్ని అడ్డంకులు ఉన్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. నిరంతరం ప్రజల్లో ఉంటున్న ఎమ్మెల్యే కోటంరెడ్డిని అభినందిస్తున్నానని ఎంపీ ఈ సందర్భంగా అన్నారు. 'మన ఎమ్మెల్యే.. మన ఇంటికి' కార్యక్రమంతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువ అవుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## కార్పొరేషన్‌లో ఉద్యోగులకు పదోన్నతి

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు బిల్ కలెక్టర్లు, ఇద్దరు అటెండర్లు, ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించారు.

## అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

మండల కేంద్రమైన అల్లూరులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.వి రమణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, గౌరవ అధ్యక్షుడు ఎం.గంగాధర్, జిల్లా సభ్యులు టి.శ్రీనివాసులు, ఎంజిఆర్ శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌లు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## నేరాల నియంత్రణకు గట్టి చర్యలు

### - కొత్త డిఎస్పీ మురళీకృష్ణ



నెల్లూరు నగర ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని, నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని నెల్లూరు నగర డిఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల బాలాజీ మారుతీ మురళీకృష్ణ అన్నారు. కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన మురళీకృష్ణ 1989లో పోలీసుశాఖలో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2005లో సిఐగా పదోన్నతి పొంది, ఆ తర్వాత 2014లో డిఎస్పీగా సిఐడిశాఖలో పనిచేశారు. అక్కడి నుంచి బదిలీ అయి గత 9 నెలలుగా తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం డిఎస్పీగా విధులు నిర్వహిస్తూవచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరు డిఎస్పీగా బదిలీ అయి వచ్చారు. నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని నగర డిఎస్పీ కార్యాలయంలో మురళీకృష్ణ ఈ నెల 7న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషిచేస్తామని, ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను, క్రిందిస్థాయి సిబ్బంది సూచనలను దృష్టిలో పెట్టుకుని నేరాలను కట్టడిచేస్తామన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బాణాసంచా తయారీ కేంద్రాలను, విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తామన్నారు. నూతన డిఎస్పీని నగర ఇన్‌స్పెక్టర్లు జి.వెంకటరావు, పాపారావు, వి.సుధాకర్‌రెడ్డి, జి.మంగారావు, ఎస్ఐలు కరిముల్లా, శ్రీహరి, సుభాన్, అలీసాహెబ్, విజయకుమార్, కొండయ్య తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. ఆ తర్వాత డిఎస్పీ మురళీకృష్ణ జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణను, ఏఎస్పీ బి.శరత్‌బాబును గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

## తెలుగు సాహితీ వైభవాన్ని చాటిన కవి గుర్రం జాషువా



తెలుగు సాహిత్య వైభవాన్ని చాటిన ఘనత ప్రఖ్యాత కవి, పద్మభూషణ్, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాకే దక్కుతుందని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి.వీరయ్య అన్నారు. జాషువా కవితాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ బి. కిరణశ్రీ ఆధ్వర్యంలో ఈ నెల 7న నగరంలోని పాత జడ్పీ సమావేశమందిరంలో గుర్రం జాషువా 122వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాషువా రచనలు-సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుమారు 50 మంది వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. ఉపకులపతి ఆచార్య వి. వీరయ్య మాట్లాడుతూ, సాంస్కృతిక ఆచారాలు, భూమి, రైతుల జీవన విధానం, నిరుపేదల ఆకలి, కులవ్యవస్థ మొదలైన అంశాలు జాషువా కవితల్లో ఉన్నాయన్నారు. జాషువా తాను ఏ మతానికి, కులానికి చెందినవాడను కానని, తాను విశ్వనరుడినని అన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. నేటికీ జాషువా మనందరి స్మృతిపథంలో ఉన్నారంటే అందుకు ప్రధాన కారణం ఆయన విశిష్టమైన రచనలేనన్నారు. నెల్లూరులోని జాషువా కవితాపీఠం తరఫున ప్రతి ఏటా జాషువా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయన పట్ల, ఆయన సాహిత్యం పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్న విద్వాన్ బూతపాటి కిరణశ్రీని ఉపకులపతి వీరయ్య అభినందించారు. అనంతరం, జాషువా 122వ జయంతిని పురస్కరించుకుని నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అవార్డు-2017ను విశాఖపట్నంకు చెందిన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య చందు సుబ్బారావుకు అందజేశారు. ఈ అవార్డుతో పాటు 5వేల రూపాయల నగదును, జ్ఞాపికను బహూకరించి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, జాషువా సాహిత్యంపై ఈనెల 4న హైస్కూల్ విద్యార్థులకు, కళాశాలలు, మరియు విశ్వవిద్యాలయ విద్యార్థులకు స్థానిక విఆర్ కళాశాలలో వేరువేరుగా 'జాషువా పద్యరచన' వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సాహితీ వేత్తలు చీమకుర్తి వెంకటేశ్వర్లు, ఆలూరు శిరోమణిశర్మ, డా. చిన్నం రాజారాం, డా. టి.విమల, డా.శ్రీనివాసరావు, ఆచార్య ఆదిత్య, అవ్వారు శ్రీధరబాబు, డా. గంధం వేణు పాల్గొన్నారు.

## దాతలు ఇచ్చిన...
# ఆస్తులను పరిరక్షించుకోవాలి



గతంలో దాతలు ఇచ్చిన ఆస్తులను పరిరక్షించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలు, దేవాదాయశాఖలపై ఉందని రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 8న నెల్లూరులోని రేబాలవారి వీధిలో రాష్ట్ర బ్రాహ్మణ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడారు. గతంలో ఎందరో మహానుభావులు కోట్లాది రూపాయల ఆస్తులను సమాజహితం కోసం దానాలు చేశారని, ఆ ఆస్తులు నిరర్ధకంగా ఉండడమో, లేదా దుర్వినియోగం కావడమో జరుగుతుండడం విచారకరమని, అదే విధంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆస్తులపై వచ్చే ఆదాయం పక్కదారి పడు తోందని, ఇకనైనా వీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. కృష్ణపట్నంలో ఉన్న భూములను పరిరక్షించేందుకు తాను కృషి చేశానని మంత్రి అంటూ, నెల్లూరులో బ్రాహ్మణ కార్పొరేషన్ పథకం కింద సంవత్సరాదాయం 6లక్షల రూపాయలకు తక్కువగా ఉన్న పేదకుటుంబాలకు చెందిన పదిమంది విద్యార్థులను ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు పంపా మన్నారు. సమాజ హితులైన బ్రాహ్మణ సమాజానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుం దన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మెన్ వేమూరి ఆనందసూర్య, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రరెడ్డి, జిల్లా అర్చకమండలి అధ్యక్షుడు ప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

## భూ సర్వేలపై...
# రెవిన్యూ సిబ్బందికి శిక్షణ అవసరం

**- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్**




రెవిన్యూ సిబ్బంది తొలి ప్రాధాన్యత భూ సమస్యలపై ఉంటుందని, కనుక భూ సర్వేలపై వారు శిక్షణ పొందడం ఎంతో అవసరమని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. సోమవారం నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో రెవిన్యూ సబార్డినేట్స్, గ్రామరెవిన్యూ అధికారులకు సర్వే భూ రికార్డుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెవిన్యూ సిబ్బంది చాలా బాగా పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అభినందిం చారు. ఈ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని వారు పూర్తిగా సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఎప్పుడో 1900 సంవత్సరం నుండి హద్దులు నిర్దేశించడం జరిగిందని, అదే ప్రామాణి కంగా తీసుకుని ముందుకు వెళ్లడం జరిగిందని ఆయన అంటూ, ఈ శిక్షణతో అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు సురేంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో 7 జిల్లాల్లో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. 42 రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. అందరూ ఈ శిక్షణలో పాల్గొనాలని, ఎవరూ గైర్హాజరు కావద్దని, దినసరి హాజరును బట్టి పరీక్షలకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవిప్రభు, అసిస్టెంట్ డైరెక్టర్ యోగేంద్రరెడ్డి, రెవిన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పా రవీంద్రబాబు, తహశీల్దార్లు మధుసూదన్, నరసింహులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నెల్లూరు శాఖ పర్యవేక్షకులు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## • దోమల నివారణ కోసం
# ఫాగింగ్ మిషన్ అందజేసిన విపిఆర్

### ఆయన సేవలు అభినందనీయం అన్న జిల్లా ఎస్.పి.



ముదురుదోమలతో అల్లాడుతున్న నెల్లూరీయులకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కానుక అందించాడు. కనీసం ప్రజలకు అవసరమైన ఫాగింగ్‌మిషన్ ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో వున్న నెల్లూరు కార్పొరేషన్‌కి ఆయన ఫాగింగ్ మిషన్ ఏర్పాటు చేసిన వాహనాన్ని కొనుగోలు చేసి ఇచ్చాడు.

జిల్లా ఎస్.పి. పిహెచ్‌డి రామకృష్ణచే ఈ వాహనాన్ని ఆయన మునిసిపాలిటీ ద్వారా నెల్లూరీయులకు అంకితం చేశాడు. ఈ నెల 8వ తేదీ గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావుల సమక్షంలో ఈ సత్కార్యానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టాడు.

గ్రామీణ ప్రాంతవాసుల దాహార్తిని తీర్చడానికి "విపిఆర్ వికాస్" కార్య క్రమం ద్వారా ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న సేవలు, అలాగే విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం వంటి సేవా కార్యక్రమాల కోసం విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం వంటి విషయాలపై జిల్లా ఎస్.పి. విపిఆర్‌ను అభినందించారు. సామాజిక స్పృహతో గత రెండుదశాబ్దాలుగా విపిఆర్ చేస్తున్న సేవలు నెల్లూరుజిల్లాకే గర్వకారణమని అన్నారు.

# వడ్డెరల సంక్షేమానికి ఫెడరేషన్ ఏర్పాటు

**- ఛైర్మెన్ దేవెళ్ళ మురళి**



రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది వడ్డెరలు ఉన్నారని, వారిని గుర్తించి వారి సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ఎంతో శుభపరిణామమని ఏపి వడ్డెర ఫెడరేషన్ ఛైర్మెన్ దేవెళ్ళ మురళి అన్నారు. మంగళ వారం ఉదయం నెల్లూరులోని పినాకిని అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వడ్డెర ఫెడరేషన్ ద్వారా గత మూడు సంవత్స రాల్లో వడ్డెరల అభ్యున్నతికి 82కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. 2016-17 సంవత్సరానికి నెల్లూరుజిల్లాలో 19 యూనిట్లు మంజూరుచేయగా, 2017-18 సంవత్స రానికి 13 యూనిట్లు మంజూరు చేశా మని, అవసరమైతే నూరు యూనిట్ల మంజూరుకు కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బృందంలో సభ్యులను 5 మందిని ఒక యూనిట్‌గా గుర్తించి రుణాలు మంజూరు చేసేందుకు జిఓ నం.18ని ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. సభ్యుల్లో ఒక్కొక్కరికి లక్షరూపాయలు సబ్సిడీ, లక్ష రూపాయల బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సెలక్షన్ కమిటీలో వడ్డెర కులస్తులే ఉండేవిధంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యలు చదువుకోవాలనుకునేవారికి 10లక్షల మేర, అదేవిధంగా పెళ్ళిళ్ల సమయంలోనూ పాతిక వేల రూపాయలు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. వడ్డెర సంఘం జాతీయనాయకురాలు మల్లి నిర్మల మాట్లాడుతూ, వడ్డెర ఫెడరేషన్ ద్వారా చేపడుతున్న పలు సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని, వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్‌కి తొలిసారిగా మహిళ లను నియమించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొ రేషన్ ఇ.డి వెంకటస్వామి, జిల్లా బిసి సంక్షేమ అధికారి నరసారెడ్డి, మస్తాన్‌బాబు, శంకరయ్య పాల్గొన్నారు.

# నారాయణంటే భయపడుతున్నారు

**- ఎమ్మెల్యే అనిల్**



మంత్రి నారా యణ పేరు చెబితేనే అధికారులు ఈ జిల్లాకు రావడానికి భయపడు తున్నారు. మహిళా ఉద్యోగులైతే ఆందో ళన చెందుతున్నారు. మంత్రికి నిద్రపట్టకుంటే నగరంపై పడతారు... మంత్రి నారాయణ అభివృద్ధి పేరుతో గాల్లో కోటలు కడుతూ చేతల్లో మాత్రం అవినీతికి బాటలు పరుస్తున్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. 10వ తేదీ నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు తమ దోపిడీకి పండగలు, ఉత్సవాలను కూడా వదిలిపెట్టడం లేదన్నారు. ఇటీవల రొట్టెలపండుగ పేరుతో కోట్లు దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల 10మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే వారిలో 9మంది నారాయణ విద్యాసంస్థలకు చెందినవారే! ప్రతి విషయానికీ కమిటీలు వేస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం మరి నారాయణ విద్యార్థుల ఆత్మహత్యల విచారణకు ఎందుకు కమిటీని వేయడం లేదని ప్రశ్నించారు. తన సంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్య లపై మంత్రి నారాయణ నోరు విప్పడం లేదని, కనీసం చనిపోయిన విద్యార్థుల కుటుంబాల వారిని మానవతా దృక్పథంతో పరామర్శించకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు. తల్లిదండ్రులు ఆస్తులను అమ్ముకుని తమ బిడ్డలను నారాయణ విద్యా సంస్థల్లో చేర్పిస్తున్నారని, కాని ఇక్కడ వేధింపులు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదలకు కట్టిస్తున్న ఇళ్ళల్లో కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని, ఆ అవినీతిపై మంత్రితో చర్చకు తాను ఇప్పటికీ సిద్ధంగా వున్నానని ఆయన సవాల్ విసిరాడు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఖలీల్‌అహ్మద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## గూడూరు డివిజన్ వార్తలు

### క్యాప్ ఆధ్వర్యంలో...

# చిన్నారులకు యూనిఫాం, పుస్తకాలు




చిన్నారులకు యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న డిఐజి రమణకుమార్, ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, మయూరి శ్యాంయాదవ్ తదితరులు

గతంలో జిల్లా ఎస్పీగా ఉండి తాను ప్రారంభించిన చైల్డ్ అండ్ పోలీసు ప్రాజెక్ట్ (క్యాప్)ను డిఐజి బి.వి.రమణకుమార్ ఆదివారం సందర్శించారు. క్యాప్ పిల్లల పుట్టినరోజు వేడుకలకు హాజరై వారిని ఆశీర్వదించారు. తొలుత ఆయన హౌసింగ్‌బోర్డు కాలనీలో బోడిగాడితోట స్మశానవాటికలో నివసిస్తున్న వారి కోసం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు నిర్మిస్తున్న 254 గృహాలను పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హౌసింగ్‌బోర్డుకు చేరుకున్న బోడిగాడితోట నివాసులు డిఐజికి ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ త్వరలోనే గృహాలన్నీ పూర్తి చేసి అందించడం జరుగుతుందన్నారు. కాలనీల్లో ఉన్న ప్రజలు కూడా క్యాప్‌లో చదువుతున్నవారి పిల్లలులాగానే క్రమశిక్షణతో ఉండాలని, నివసించబోయే కాలనీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణతో కలిసి క్యాప్‌కు వెళ్లి పిల్లల పుట్టినరోజు వేడుకలకు హాజరై పిల్లల చేత కేక్ కట్ చేయించి వారికి స్వీట్లు, యూనిఫాం, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వారి ఉన్నతిని కాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందజేశారు. నీతి నిజాయితీతో మెలగాలని, సంఘంలో మంచిపేరు తెచ్చుకోవాలని వారికి బోధించారు. ఈ కార్యక్రమంలో గొలగమూడి ఇ.ఓ సుబ్రహ్మణ్యం, గూడూరు శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపకుడు మయూరి శ్యాంయాదవ్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ వీరభద్రుడు, జిల్లాలోని పలువురు డిఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ముగ్గురు నిందితుల అరెస్ట్

- 36 సవర్ల బంగారం స్వాధీనం



చోరీ వివరాలను తెలుపుతున్న రూరల్ సిఐ అక్కేశ్వరరావు, ఎస్సై బాబి

గూడూరు డివిజన్‌లో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్దనుంచి 36 సవర్ల బంగారం, మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ అక్కేశ్వరరావు తెలిపారు. గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల చోరీకి పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గూడూరు మండలం, తిప్పవరప్పాడు, ఉపాధ్యాయనగర్, వెంకటేశుపల్లి, బాలాయపల్లి మండలం పరిధిలోని నిడిగల్లు, గొట్టికాడు, చిలమనూరు, వెంకటగిరి, నాయుడుపేట మండలం, పుదూరు, ఓజిలి తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలోకి ప్రవేశించి బంగారు వస్తువులను చోరీ చేస్తున్న చిత్తూరుజిల్లా తొట్టంబేడు మండలం మామిడిగుంట గ్రామానికి చెందిన తేరు బాలకృష్ణ, తేరు పవన్‌కుమార్, శ్రీకాళహస్తి మండలం దొమ్మరిపాళేనికి చెందిన సాలపక్షి మహేష్‌బాబు అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. గూడూరు మండలం తిప్పవరప్పాడు అడ్డరోడ్డు వద్ద ఈ నెల 7వ తేదీ రూరల్ ఎస్ఐ బాబీ తన సిబ్బందితో గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారించామని, అరెస్టు అయిన చోరీ ముఠాకు 15 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, వారి నుంచి రూ.5లక్షలు విలువైన 36సవర్ల బంగారం, మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లు, రెండు వెండి గ్లాసులను, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ చోరీ కేసు ఛేదించడంలో సాయపడ్డ సిబ్బంది ఆర్.వెంకటేశ్వరరాజు, సుబ్బారావు, చిరంజీవి, ఆదినారాయణ, శ్రీనివాసులు, మాధవరావు తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆనంద్, విష్ణు ఉన్నారు.

# సకాలంలో లబ్ధిదారులకు గృహాలు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహ సముదాయాన్ని వేగంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించి సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని పురపాలక శాఖా మంత్రి నారాయణ తెలిపారు. గూడూరు పట్టణ సమీపానున్న గూడూరు - వెందోడు రోడ్డు పక్కన ఎన్టీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గృహ సముదాయాన్ని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ తదితరులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన, కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెంచురామయ్య, అధికారులు, తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - చైర్‌పర్సన్ దేవసేన



గూడూరు పట్టణంలో కాలాను గుణంగా వ్యాధుల ప్రభావం ఎక్కువ వున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. ఇటీవల ఆమె గూడూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పట్టణంలో బ్లీచింగ్ చల్లాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. రెండో పట్టణంలోని ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కమిషనర్ లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలిబోయిన రమేష్, మహేష్ రెడ్డి, భానుప్రకాశ్, శ్రీనివాసులు, కల్పన, మస్తానమ్మ, విజయమ్మ, నాయకులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయులకు లయన్స్ సన్మానం




పురందర్‌రాజు, జేమ్స్‌లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సమాజంలో గురువుకు ఉన్న గుర్తింపు మరెవరికీ లేదని, గురువును మించిన దైవం లేదని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలం చవటపాళెం జడ్పీ పాఠశాలలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పురంధర్‌రాజు, జేమ్స్‌లను ఇటీవల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, ఎంఇఓ సూర్యనారాయణ తదితరులు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ఉత్తమపౌరులుగా వారికి సమాజంలో గుర్తింపు వచ్చేలా నడవడిక నేర్పేది గురువు ఒక్కరే అని తెలిపారు. గురువు స్థానంలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థినీ విద్యార్థులను తమ పిల్లలుగానే చదువు చెప్పి వారిని ఉన్నత శిఖరాలకు చేరేలా చేసే మహానుభావులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్, ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్, షేక్ రియాజ్‌అహ్మద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# వైద్య సదస్సులు ఎంతో ఉపయోగకరం



వైద్యరంగంలో శరవేగంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడానికి, తద్వారా మేధస్సును పెంపొందించుకునేందుకు వైద్య సదస్సులు వైద్యులకు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏపిసిఎస్ఐ-2017) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నెల్లూరులో జరిగిన 3వ రాష్ట్రస్థాయి కార్డియాలజీ సదస్సుకు మంత్రి సోమిరెడ్డి ఈ నెల 7న ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో అనేకమంది గుండెపోటుకు గురై మరణిస్తున్నారని, అయితే వైద్యశాస్త్రం ఎంతగానో అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో వైద్యులు అత్యంత ఆధునికమైన చికిత్సల ద్వారా బాధితులకు ఆ వ్యాధిని నయం చేస్తుండడం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. దీంతో గుండెపోటు మరణాలు బాగా తగ్గే అవకాశం ఉందన్నారు. ఏపీ కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ భాస్కరనాయుడు మాట్లాడుతూ, 1991లో ఈ సొసైటీని ఏర్పాటు చేశామని, ఇందులో 4వేలమంది కార్డియాలజిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ సొసైటీకి దేశవ్యాప్తంగా 27 శాఖలున్నాయని, ఈ సొసైటీ ద్వారా సదస్సులు ఏర్పాటుచేస్తూ వైద్యరంగంలో తగు సేవలందిస్తున్నామన్నారు. కార్డియాలజికల్ సొసైటీ ప్రతి నిధులు తమ సంఘానికి సంబంధించి ప్రత్యేక భవనం నిర్మాణానికి రాజధాని అమరావతిలో స్థలం కేటాయించాలని మంత్రి సోమిరెడ్డిని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన డాక్టర్ శ్రీనివాసరాజును ముగింపు రోజున ఘనంగా సత్కరించారు.

సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.రమేష్, ఎంసిఐ అబ్జర్వర్ డాక్టర్ అశోక్‌తో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 350మంది కార్డియాలజిస్టులు పాల్గొన్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమించి, ఆదాయము పెరుగుదలకు కృషి చేస్తారు. బంధువర్గంతో కొద్ది సమస్యలు రావచ్చును. వస్తు వాహన రిపేర్లు జరుగుతాయి. గృహోపకరణాలు కొత్తవి సమకూర్చు కొంటారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వ్యవహారాలు సర్దుబాటు కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. పెద్దలతో, ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు నెరవేరడానికి పట్టుదలతో ప్రయత్నాలు చేయాలి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు, పెట్టుబడుల మీద ఆదాయం లభిస్తుంది. మీతో విభేదించిన వారే మరలా సన్నిహితంగా మెలుగుతారు. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. ఉద్యోగులకు విధి నిర్వహణలో సామర్థ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందులనెదుర్కొనవలసి ఉంటుంది. వృత్తి జీవనం సుమారుగా జరిగినా వ్యాపార వర్గాల వారికి నిరాశే ఉంటుంది. ఆదాయం సామాన్యం. ప్రభుత్వ పరంగా అనుమతులు, బ్యాంకు ఋణాలు ఆలస్యం కాగలవు. బంధువర్గంతో విభేదాలు లేకుండా చూచుకొనాలి. కుటుంబంలో భిన్నాభిప్రాయాలుంటాయి. సర్దుబాటు చేసికొనాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయం సామాన్యం. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఆర్థికాభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబంలో చిన్నచిన్న భేదాభిప్రాయాలు, బంధువర్గంతో కొద్దిపాటి విభేదాలుండగలవు. కొత్త వారితో పరిచయాలు కలుగుతాయి. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 13.10.2017 నుండి
తేది. 19.10.2017 వరకు

ఈ వారం మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, కన్యలో రవి శుక్ర కుజులు, తులలో గురుబుధులు, 17 తేది నుండి తులలో రవి, వృశ్చికంలో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

గురుమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు ఉండవు.
తేది 18 నరక చతుర్దశి. తేది 19 గురువారం దీపావళి అమావాస్య.

**ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | అష్టమి | ఉ॥ గం.7.50వ॥ |
| | పిదప | నవమి | రా॥ గం.5.42వ॥ |
| తేది. 14 | శని | దశమి | రా॥ గం.3.45వ॥ |
| తేది. 15 | ఆది | ఏకాదశి | రా॥ గం.2.04వ॥ |
| తేది. 16 | సోమ | ద్వాదశి | రా॥ గం.12.45వ॥ |
| తేది. 17 | మంగళ | త్రయోదశి | రా॥ గం.12.51వ॥ |
| తేది. 18 | బుధ | చతుర్దశి | రా॥ గం.11.50వ॥ |
| తేది. 19 | గురు | అమావాస్య | రా॥ గం.11.06వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. కొత్త వ్యాపార భాగస్వామ్యాలకు పెట్టుబడులకు అవకాశాలు లభించగలవు. రావలసిన బాకీలు పొందడం, వ్యవహారాలలో ప్రముఖంగా వుండడం, దైవ కార్యాలు, వేడుకలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు అధికారుల చేయూత బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. విద్యా ప్రగతి బాగుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. దూర ప్రయాణాలుంటాయి. సేవా కార్యక్రమాలు, దైవ కార్యాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఖర్చులు కూడా అదనంగా ఉంటాయి. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. నిర్మాణాలు చేపట్టిన వారు త్వరగా జరుపుతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో రాణిస్తారు. ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలుంటాయి. ముఖ్య వ్యవహారాలు మీ సూచనలు, సలహాల ప్రకారం జరుగుతాయి. రావలసిన బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి జీవనము కలవారికి, వ్యాపారవర్గాలకు ఆర్థికంగా, అన్ని విధములా బాగుంటుంది. ఆదాయము పెరుగుతుంది. కార్యములను నిర్వహించడంలో ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారు. అనుకోని అదనపు ఆదాయముంటుంది. పనులందు కొద్ది టెన్షన్ పడుతుంటారు. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేపట్టిన పనులకు ఆటంకాలు కలుగుతాయి. వృత్తి వ్యాపార వర్గాలకు శ్రమకు తగ్గ ఫలితాలుండవు. ఆదాయం సామాన్యం. వాహనాలు నడిపేవారు, యంత్రాలు, కరెంటు పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. కాంట్రాక్టర్లు, నిర్మాణాలు జరిపేవారికి వర్షాలతో సమస్యలుంటాయి. ఆర్థికంగా వత్తిడులుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారాలలో కొత్త అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. వృత్తి జీవనంలో సామాన్య ఆదాయముంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. సోదర, బంధువర్గం నుండి సహాయ సహకారాలు పొందుతారు. కొద్ది అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అనవసర విషయాలలో తల దూర్చవద్దు. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వ్యాపారాలలో ఆశించిన స్థాయిలో వృద్ధి ఉండదు. గృహ, వస్తు వాహన రిపేర్లుంటాయి. పంతాలు పట్టింపులకు పోకుండా లౌక్యంగా పనులు జరుపుకొనాలి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు జరుపుతారు. ఉద్యోగులకు పని భారం, అధికార వర్గం నుండి వత్తిడులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సమర్ధత బాగుండినా అనుకున్న పనులు సరిగా జరుగవు. వృత్తి జీవనం గలవారికి ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. వ్యాపారాల వృద్ధి కొరకు ప్రయత్నాలు నెరవేరకపోవచ్చును మరియు రాబడి సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. కుటుంబంలో భేదాభిప్రాయాలను సర్దుబాటు చేసుకుంటారు. అనవసరపు ఖర్చులుంటాయి.

# కోతల రాయుడి వాతలు

శ్రీను గల్పిక

**భేతాళకథ**

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్‌థర్టీకల్లా నిద్ర లేచాడు. పెద్దపెద్ద హోటళ్లలో టిఫిన్ తింటే తిన్న తిండి కంటే జీఎస్టీ బిల్లే ఎక్కువవుతుందని భయపడి మద్రాసుబస్టాండ్ వద్ద రోడ్డు మీదున్న టిఫిన్ బండి వద్దే పాతిక దోశలు, పాతిక బోండాలు తిన్నాడు. అప్పుడే అటుగా రాకెట్‌లా దూసుకొచ్చిన ఆటో ఎక్కి పెద్దాసుపత్రికి చేరుకున్నాడు. మార్చురీలోకి వెళ్లి డెంగ్యూ జ్వరంతో చనిపోయిన ఓ ఫ్రెష్ బాడీని భుజాన వేసుకుని బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక వైపు నడవసాగాడు. విక్రమార్కుడికి ఎం.జి.బి. మాల్‌కు సమీపంలోకి రాగానే ఎండ ధాటికి చెమటలు కారసాగాయి. ఎండ చుర్రుమనడంతో బాడీలోని భేతాళుడిలో కూడా చలనం వచ్చింది. అతను వుండి... విక్రమార్క... ఏ ఆటో ఎప్పుడు ఎటువైపు నుండి వచ్చి గుద్దుతుందో తెలియని ఈ నెల్లూరు నగరంలో, ఎప్పుడు ఏ కుక్క కరుస్తుందో తెలియని ఈ రోడ్లల్లో, ఏ క్షణమైనా డెంగ్యూ జ్వరాన్ని తగిలించగల పవర్ వున్న ఐఆర్20-420 హైబ్రీడ్ దోమలున్న ఈ సిటీలో, చుట్టూ వర్షాలు పడుతున్నా మండు టెండలతో నిప్పుల కొలిమిలా వున్న ఈ సింహపురి సీమలో చెమటలు కక్కుతూ నువ్వు పడుతున్న కష్టాన్ని చూస్తుంటే నాకు జాలేస్తుంది. నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు 'కోతలరాయుడు-వాతల రాయుడు' కథ చెబుతాను విను అంటూ రోడ్డు పక్కనేవున్న బెల్టు షాపులోకి తీసుకెళ్లి కూర్చోబెట్టి చెప్ప సాగాడు.

యూపిఏ పదేళ్ల పాలనలో రోజుకో కుంభకోణంతో నాటి కాంగ్రెస్ అవినీతి పాలన పట్ల విసుగెత్తిపోయిన ప్రజలకు బీజేపీ ప్రధాని అభ్యర్థిగా రంగంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ఆశాదీపంలా కనిపించాడు. దేవుడు పంపించిన దయామయుడిలా అనిపించాడు. అప్పట్లో దేశంలో ప్రజల పరిస్థితి చూసి నరేంద్ర మోడీ కన్నీళ్ల పర్యంతమయ్యాడు. కనీసం ఇంటికో కారు లేదని, పేద కుటుంబాలకు బంగళాలు లేవని, తినడానికి బిర్యానీ కూడా దొరకడం లేదని తెగ బాధపడ్డాడు. అమెరికాలో వున్నోడు సూటూబూటూ వేసుకుని తిరుగుతుంటే మనం ఇంకా లుంగీలు, అంగీలు కట్టుకుని తిరగడమేంటని ఆవేదన చెందాడు. మన మీడియా కూడా మోడీ వస్తే 'దేశం' తలరాత మారుతుందని ప్రచారాన్ని దంచేసింది. 'మీ ఓటు... మీ బంగారు భవిష్యత్తుకు రూటు' అంటూ బీజేపీ నాయకులు తెగ ఊదరగొట్టేసారు. 2014 ఎన్నికల్లో మోడీ బంపర్ మెజార్టీతో గెలిచాడు. గుజరాత్‌లో సీఎంగా నరేంద్రమోడీ ఏం చేసాడన్నది కేరళలో వున్న రావ్ నాడార్‌కు, తమిళనాడులో వున్న పొన్నుస్వామికి, కర్నాటకలో వున్న నంజుగౌడకు, ఏపిలో వెంకట సుబ్బయ్యకు, యూపిలో వున్న సుందర యాదవ్‌కు, పశ్చిమ బెంగాల్‌లో వున్న చతుర్ముఖ ఛటర్జీకి... ఇలా ఎవరికీ తెలియదు. కాని, గుజరాత్‌లో నరేంద్ర మోడీ ఏదో చేసాడని, ఆయన ప్రధాని అయితే దేశంలో అదే చేస్తాడని, మన తల రాతలు మారుతాయని భావించి అన్ని రాష్ట్రాల ప్రజలు ఓట్లేసారు. మోడీ ప్రధాని అయ్యాడు. ప్రజలందరూ సూటు, బూట్లకు ఆర్డర్ ఇచ్చారు. కార్ల షోరూమ్‌లకు పరుగెత్తారు. లగ్జరీ కార్లు బుక్ చేసారు. ఇక కొన్ని నెలలే... ఆరు దశాబ్దాల తమ దరిద్రం తీరబోతుందని, కొత్త జీవితానికి తెర లేవబోతోందని, కొత్త ఉషస్సులు, ఉగాదులతో తమ బ్రతుకులలో కళాకాంతులు రాబోతున్నాయని ఆశపడ్డారు. అయితే, ప్రధానిగా నరేంద్ర మోడీ తీసుకున్న నోట్ల రద్దుతో దేశ ప్రజల బ్రతుకులు అతలాకుతలమయ్యాయి. నోట్ల రద్దు పెద్ద ఫ్లాప్ షోగా మిగిలిపోగా ఆర్థిక వ్యవస్థలు బాగా దెబ్బతిన్నాయి. అది చాలదన్నట్లు ఆర్థిక సంస్కరణలంటూ తెచ్చిన జీఎస్టీతో సామాన్యుడికి పన్ను పోటు పెరిగింది. నరేంద్ర మోడీ వస్తే ఒంటి మీదకు సూటూ బూటూ వస్తుందనుకున్న జనానికి మోడీ ఒంటి మీద బనియన్ కూడా మిగల్చకుండా చేసాడు. ప్రతిఒక్కరి మీద ఆర్థిక భారం పడసాగింది. మోడీపై ప్రజలు పెట్టుకున్న అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి. ఎన్నికల ముందు కోతలరాయుడు ఇప్పుడు వాతల రాయుడయ్యాడు... అని భేతాళుడు ముగించి... ఇప్పుడు చెప్పు... నేను అధికారంలోకి వస్తే ప్రజలకు స్వర్గం చూపిస్తానన్న మోడీ ఇప్పుడు నరకం ఎందుకు చూపిస్తున్నాడు. కావాలనే చేస్తున్నాడా? తెలిసీ తెలియక చేస్తున్నాడా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో అమరావతి రాజధాని భవనాలకు ఇంజనీర్‌వై అష్టకష్టాలు పడతావని హెచ్చరించాడు.

అప్పుడు విక్రమార్కుడు... భేతాళ... ఇందులో చిన్న లాజిక్ ఉంది. 70ఏళ్ల పాటూ కాంగ్రెస్ వాళ్ళు అభివృద్ధి స్వర్గాన్ని చూపిస్తామంటూ ప్రజలను ఒక మార్గంలో తీసుకెళ్లారు. ఈ మార్గంలో అవినీతి ముళ్ళు, అక్రమాల రాళ్ళు కూడా వున్నాయి. దీని మూలంగానే ప్రయాణం బాగా ఆలస్యం కాసాగింది. ఉదాహరణకు నెల్లూరు నుండి తిరుపతికి బయలుదేరాం. శ్రీకాళహస్తి దాకా పోయాక ఈ మార్గం బాగా లేదని చెప్పి అక్కడిదాకా వెళ్లిన వాళ్లని వెనక్కి తీసుకొచ్చి ఈసారి పొదలకూరు, రాపూరు, వెంకటగిరిల మీదుగా తిరుపతికి తీసుకెళితే ఎలా వుంటుంది... అలసటకు అలసట... టైంకు టైమూ బొక్క... దీని బదులు కాళహస్తి నుండే పోయే దారిని కొంచెం బాగుచేసుకుని పోతుంటే తొందరగా తిరుపతికి చేరుకుంటారు. కాని, ఇప్పుడు మోడీ చేసిన పని ఇలానే వుంది. 70ఏళ్ల పాటూ నిలబెట్టుకున్న ఆర్థిక వ్యవస్థలో లోపాల్ని సరిదిద్ది సంస్కరణలు తేవాలేగాని ఆ ఆర్థిక వ్యవస్థనే పూర్తిగా క్లోజ్ చేసి కొత్త ఆర్థిక విధానాలు తేవడంతోటే ప్రజలకు సూటు కోటు సంగతి ఎలాగున్నా ఒంటి మీద గోచీలు కూడా మిగలడం లేదని, పన్నులతో వాళ్ళ ఒంటిమీద వాతలు తేలుతున్నాయని చెప్పాడు. విక్రమార్కుడి సమాధానంతో సంతృప్తి చెందిన భేతాళుడు తాగిన బీర్ సీసాలకు బిల్ కట్టకుండా పక్కనేవున్న చెట్టుమీదకు చెక్కేసాడు.

# ఆగిన 'సింహ' గర్జన

బివి నరసింహం



ఇక లేరు

**ఆయన** గర్జించే సింహం. వేదిక ఎక్కితే సభా ప్రాంగణమంతా దద్దరిల్లేలా తన అద్భుత కంఠస్వరంతో కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయనకాయనే సాటి. ఆయన వృత్తి వ్యాపారమే అయినప్పటికీ ప్రవృత్తి మాత్రం సాహిత్య-కళా సేవే. ఆయన మైకు పట్టాడంటే చాలు.. 'కళావాచస్పతి' కొంగర జగ్గయ్య మనకు గుర్తుకు రావల సిందే. ఆయన సభను నిర్వహిస్తుంటే 'సభాసామ్రాట్' కెవి భాస్కరరావు మదిలో మెదలాల్సిందే. సహస్ర సభలతో 'సహస్ర సభా సింహం' బిరుదాంకితుడై, ద్విసహస్ర సభ లతో తన బిరుదుకు ముందు 'ద్వి' ని అలంకరించుకున్న బొంతల వెంకట నరసింహం... ఇక లేరు.

అక్టోబర్ 6వ తేదీ అర్ధరాత్రి సుమారు 1.30 గంటల ప్రాంతంలో ఆయన తన స్వగృహంలో ఆకస్మికంగా తుది శ్వాస విడిచారు. నెల్లూరు సాహిత్య కళారంగాలకే కాదు... ప్రతిరోజూ లేదా వారంలో రెండురోజులైనా టౌన్‌హాల్లో కాలక్షేపం చేసే ఎంతోమందికి ఇది విషాద వార్త. బివియన్ లేని టౌన్‌హాలు చాలామంది దృష్టిలో వేదుక లేని వేదికే అవుతుందనడంలో అతిశయోక్తి కాదేమో!...

బివియన్ పుట్టింది..ఉదయగిరి మండలంలోని చౌడేపల్లి గ్రామంలో. పుణ్యదంపతులైన అల్లూరమ్మ-వెంకటసుబ్బయ్యలకు సెప్టెంబర్ 9, 1946లో ఆయన జన్మించారు. స్వగ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, పామూరు, నెల్లూరు, కర్నూలులో ఇంటర్ వరకు విద్యనభ్యసించారు. 1964 నుంచి 1967 దాకా ఇంజనీరింగ్‌శాఖలో బాధ్యతలు నిర్వహించి 1967లో విఆర్ కళాశాలలో బి.ఏలో చేరారు. 1969-70లో విఆర్ సాయంత్రపు కళాశాల విద్యార్థి నాయకునిగా ఉన్న రోజుల్లోనే కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను అద్వితీయంగా నిర్వహించి అందరి ప్రశంసలను అందుకున్నారు. చిన్నతనంలోనే జంధ్యాల రాసిన ఉదయశ్రీ, కరుణశ్రీ, విజయశ్రీ, అరుణకిరణాలు, కళ్యాణ కాదంబరి, స్వప్న వాసవదత్త వంటి రచనలను కంఠస్థం పట్టారు. పెద్దల ప్రోత్సాహంతో ఉత్తర రామాయణం, భారతంలోని ఘట్టాలను కూడా కంఠస్థం పట్టారు. 1959లో వీరి కుటుంబం నెల్లూరుకు వచ్చి స్థిరపడింది. ట్రంకు రోడ్డులో వంశీ పెన్‌కార్నర్ షాపును వ్యాపారపరంగా ఆయన నిర్వహించినా, మనసంతా సాహిత్య, కళారంగాలపైనే ఉండేది. ముఖ్యంగా పద్యాలంటే ఆయనకెంతో ఇష్టం. సుమారు మూడువేల పద్యాల దాకా ఆయన కంఠస్థం పట్టారు. ఆ పద్యాలను సందర్భానుసారంగా, సమయస్ఫూర్తితో తనదైన ధీరగంభీర స్వరంతో వినిపిస్తూ... ఆయా కార్యక్రమాల్లో బివియన్ అందరి కరతాళధ్వనులందుకునేవారు.

## ఎన్నో సభలకు వారధి..సారథీ ఆయనే :

బివియన్ ఎన్నో సభలకు సారథిగా..వారధిగా నిలిచి ఆ సభలను దిగ్విజయంగా నిర్వహించేవారు. ఆయన ఏ సభ నిర్వహించినా తన వాక్చా తుర్యంతో సభను మెప్పించేవారు. వెంకటగిరి రాజా డా.సాయికృష్ణ యాచేంద్ర సృష్టించిన సంగీత గేయధార కార్యక్రమాల్లోనూ బివియన్ పాల్గొని తన కంఠస్వరంతో ఆ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగానో, అవధానాల్లో పృచ్ఛకుడిగానో ఉంటూ అమోఘంగా రాణించారు. నెల్లూరులోని వర్ధమాన సమాజం కార్యదర్శిగా సేవలందించారు. అనేక సాహిత్య, సాంస్కృతిక, సంగీత, నృత్య, ఆధ్యాత్మిక, సేవారంగాలకు సంబంధించి ఎన్నో సభలను ఆయన జనరంజకంగా నిర్వహించి ఎంతోమంది ప్రముఖుల, ప్రజల ప్రశంసలను అందుకున్నారు. ఎన్నో సంస్థల్లో ఆయన కీలక పదవులనూ నిర్వహించారు. డా.బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ కార్యదర్శిగా ఉంటూ పలువురు మహోన్నత వ్యక్తులను ఘనంగా సత్కరించి, డా. బెజవాడ గోపాలరెడ్డి అవార్డును బహూక రించారు. సింహపురి సంగీతసభ ద్వారా ఎన్నో సాహిత్య, నృత్యకార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేకించి ఆయన ఆర్యవైశ్యులకు పెద్దదిక్కుగా ఉండేవారు. ఆయా సంస్థల ద్వారా ఎంతోమందికి సేవలందించేవారు. 'అవోపా' సంస్థ ద్వారా 'వాసవీ కన్యక' నాటకాన్ని ప్రదర్శింపజేశారు.

## 'సభా సింహం' బిరుదుతో ఘనసన్మానం :

సభా నిర్వహణలో వెయ్యి సభలు పూర్తయిన సందర్భంగా 2008లో కళాంజలి సాంస్కృతిక సంస్థ అనంత్ ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరంలో బివియన్‌కు 'సహస్ర సభాసింహం' అనే బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా 2000 సభలు పూర్తయిన సందర్భంగా నెల్లూరు లోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బివియన్‌కు అభినందన సభ ఏర్పాటుచేశారు. అప్పటి తమిళనాడు గవర్నర్, డా.కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా స్వర్ణకంకణం తొడిగించు కున్నారు. ఎన్నో సభల్లో ఆయన అందుకున్న సన్మానాలకు లెక్కే లేదు.

## 'లాయర్'తో మంచి అనుబంధం



స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి, ఇతర సాహితీ ప్రముఖులతో బి.వి.నరసింహం

అన్నిటికీ మించి బివియన్ స్నేహపాత్రుడు. ఎంతోమందికి మంచి స్నేహితుడు. ప్రత్యేకించి 'లాయర్' కుటుంబంతో బివియన్‌కు ఎంతోకాలం నుంచి ఉన్న సన్నిహిత సంబంధం ఎప్పటికీ మరువలేనిది. 'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులైన తుంగా రాజగోపాలరెడ్డిగారితో ఆయనకు మంచి స్నేహం ఉండేది. ప్రతిరోజూ ట్రంకురోడ్డులో వీరు కలసి మాట్లాడుకునేవారు.ఎన్నో సాహిత్య, కళారంగ విశేషాలపై చర్చించుకునేవారు. అదేవిధంగా, ప్రముఖ సాహితీవేత్త మరుపూరు కోదండరామిరెడ్డి, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, దుగ్గిశెట్టి వెంకటరమణయ్య తదితర అనేకమంది సాహితీప్రియులు కనపడితే చాలు..ఆయన ఎంతో సంతోషిస్తూ వారితో గంటల తరబడి ముచ్చటించనిదే ఇంటికి వెళ్ళేవారు కాదు. అలాంటి స్నేహశీలి ఆయన. ఆయన మృతి సమాచారం విని ట్రంకురోడ్డు తల్లడిల్లింది. ఆయన లేని ట్రంకురోడ్డు నిజంగానే బోసిపోయినట్లయింది. ఏదేమైనా, తన సభానిర్వహణా దక్షతతో, తన వాగ్ధాటితో సింహపురి సీమ ఖ్యాతిని దశదిశలా చాటిన ఆ సభాసింహం... లేని లోటు ఎవరూ పూడ్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడుని మనసారా ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబానికి 'లాయర్' సంతాపం వ్యక్తం చేస్తోంది.

# వాకర్స్‌కు వైద్య పరీక్షలు



ప్రపంచ ఆర్థరైటిస్ దినంను పురస్కరించుకుని 12వ తేదీన నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి నుండి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ షాహుల్, డాక్టర్ శ్రీనివాస్, ఫిజియోథెరపిస్టులు విచ్చేసి బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఎముకలు, కీళ్ల వ్యాధులపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఎస్.రాఘ వేంద్రశెట్టి, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ అంకిరెడ్డి, డి.వి.సుబ్బరాజు, ఓబులరెడ్డి, శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు ఎల్ఎల్ఆర్ మేళా

ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని రవాణాశాఖ కార్యాలయంలో పోలీసులకు ప్రత్యేకంగా ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహించారు. పోలీసు శాఖలో డ్రైవింగ్ లైసెన్స్ లేని పోలీసులు, హోంగార్డులు, డ్రైవర్లు, వారి కుటుంబసభ్యుల కోసం ఈ మేళా నిర్వహించారు. మొత్తం 117మంది స్లాట్ బుక్ చేసుకోగా వారికి టెస్టులు నిర్వహించారు. వీరిలో 80మంది అర్హత సాధించారు. ఈ మేళాను ప్రారంభించిన ఉపరవాణా కమిషనర్ ఎన్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాల్సిన శాఖలోనే లైసెన్సులు లేకుండా పోలీసులు వాహనాలు నడిపితే బాగుండదని, అందుకే ప్రత్యేక ఎల్ఎల్ఆర్ మేళాలు నిర్వహించి లైసెన్సులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయకుమార్, అసిస్టెంట్ మోటార్ వాహన అధికారి రవి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ

# విద్యార్థులకు సాయం

శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వ బ్రాహ్మణ విద్యానిధి, నెల్లూరు పాలకవర్గ సమావేశం ఈ నెల 8వ తేదీన నెల్లూరు లోని సంస్థ కార్యదర్శి పుత్తేటి దయానంద ఇంటి నందు జరిగింది. సంస్థ అధ్యక్షులు ఇనుకొండ చక్రపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2017-18 సంవత్సరానికి నెల్లూరుజిల్లాలో చదువుతున్న 89మంది పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు 80వేల రూపాయలు ఉచిత విద్యార్థి వేత నంగా ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే 15మంది బి.టెక్ చదువుతున్న విద్యార్థు లకు వెయ్యి రూపాయల వంతున విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐ.శ్రీనివాసాచారి, వి.నారాయణరావు, ఎ.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ల నియామకం

గుంటూరు జిల్లా నుంచి మనజిల్లాకు నలుగురు తహశీల్దార్లను కేటాయిస్తూ సిసిఎల్ఏ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరుజిల్లాలో డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న ఏ.సాంబ శివరావు, టివి నరసింహారావు, టి.మస్తాన్, ఏ.శ్రీనివాసరావులకు తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించి మనజిల్లాకు కేటా యించారు.

# అగ్రి బాధితులను ఆదుకుంటాం...



ఈ నెల 13వ తేదీ నుండి అగ్రిగోల్డ్ బాధితుల క్షేత్రస్థాయి పరిశీలన కోసం నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ తెలిపారు. 10వ తేదీ నెల్లూరు పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ఖాతాదారుల క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. జిల్లాలో 1,17,833 మంది సిఐడి వద్ద పేర్లు నమోదు చేసుకోగా, మరో 5,576 మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 14 ప్రాంతాల్లో 52 నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసామని, బాధితులందరూ క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఈ కేంద్రాలలో 13, 14, 15తేదీలలో నమోదు చేసుకోవాలన్నారు. సిఐడి వద్ద నమోదు చేసుకున్నవారు 16,17, 18తేదీలలో నమోదు కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఎవరెవరికి ఏఏ తేదీలలో పత్రాల పరిశీలన ఉంటుందో తెలుసుకునే వివరం కోసం హెచ్‌టిటిపి:ప్రొటెక్షన్‌ఆఫ్‌ఏపిడిపాజిటర్స్‌డాట్‌కామ్ వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు. ఈ మొత్తం కార్యక్రమానికి డిఎస్పీ సుధాకర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించామని, వివరాలకు 94904 39564 నెంబర్‌లో సంప్రదించ వచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

# కళ్యాణ వైభవం...!



మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నెల్లూరు మాజీ మున్సిపల్ ఛైర్మెన్ అనూరాధల కుమార్తె **చైతన్య లక్ష్మి - సందీప్‌కుమార్**(మైసిగారి ప్రకాష్‌రావు - మైసిగారి జయలక్ష్మిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని కె.జి.కె. కళ్యాణ మండపం నందు వైభవంగా జరుగగా, 8వ తేదీ హైదరాబాద్‌లోని శోభా గార్డెన్స్ నందు జరిగిన రిసెప్షన్ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరీదేవి హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' అభినందనలు.



నెల్లూరులోని కస్తూరిబా ఆర్థోపెడిక్ హాస్పిటల్స్ అధినేత డా॥ ఆర్.వెంకటేష్ - విజయసీతల కుమార్తె **డా॥ వింధ్య - డా॥ హేమంత్** (చెన్నై వాస్తవ్యులు కె.సుదర్శనం - షకీలాల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



దగదర్తి మండలం, పెదపుత్తేడు వాస్తవ్యులు తుంగా మధుసూదనరెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు **మనోజ్‌కుమార్‌రెడ్డి - ప్రత్యుష** (కోవూరు మండలం, ఇనమడుగు వాస్తవ్యులు పొంగూరు ప్రభాకర్‌రెడ్డి - కుసుమల కుమార్తెల వివాహం ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



గతంలో కలెక్టర్ కార్యాలయ సి.సిగా పనిచేసి, ప్రస్తుతం డ్వామాలో అకౌంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీరాజు ఫణికృష్ణ సోదరుడు **వంశీకృష్ణ - తేజస్వి** (హైదరాబాద్ వాస్తవ్యులు శిష్ట ఆనందమూర్తి - పద్మజల కుమార్తెల పరిణయం ఈ నెల 4వ తేదీ హైదరాబాద్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# కోట్లుంటేనే సీట్లు!

(మొదటి పేజీ తరువాయి)

గతంలో పార్టీ జెండాలు మోసినవాళ్లను, ఏళ్లతరబడి పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసినవాళ్ళను, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లినవాళ్లను పార్టీపరంగా ఉద్యమాలు చేసినవాళ్లను పార్టీ పట్ల భక్తి, అభిమానం వున్నోళ్లను ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా నిర్ణయించేవాళ్లు. ఇంతకుముందు ఎలక్షన్‌లలో ఏ పార్టీకైనా అభ్యర్థి కావాలంటే నాయకుడికి పార్టీలో సీనియార్టీ, ప్రజాసేవలో వున్న సిన్సియార్టీ కొలమానంగా ఉండేది.

ఇప్పుడు ట్రెండ్ మారింది. ఈయన జెండా మోసాడా? మన పార్టీ బ్యానర్ కట్టాడా? మన వాల్‌పోస్టర్ అంటించాడా? మన సభలలో పాల్గొన్నాడా? మన పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేసాడా? పార్టీలో ఇవేమీ పట్టించుకోవడం లేదు. పార్లమెంటు అభ్యర్థి అయితే వంద కోట్లు ఖర్చు పెట్టుకుంటాడా? అసెంబ్లీకి అయితే పాతిక కోట్లు పెట్టుకోగలడా? అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానాల ఆలోచనా ధోరణి ఇదే! ఐపిఎల్‌లో ఫ్రాంచైజీ కంపెనీలు బాగా ఆడేవాళ్లను ఎక్కువ ధరపెట్టి కొంటాయి. ఇక్కడ మాత్రం బాగా ఖర్చుపెట్టేవారికి పార్టీలు టిక్కెట్లిస్తుంటాయి. అంతే తేడా!

రాష్ట్రంలో అధికార తెలుగుదేశం అయినా, ప్రతిపక్ష వైకాపా అయినా కోట్లు ఖర్చు పెట్టుకోగలిగిన వాళ్లకే టిక్కెట్లు అంటున్నాయి. మొన్న నంద్యాల ఉపఎన్నికను చూసిన తర్వాత లోక్‌సభకు అయితే వందకోట్లు, అసెంబ్లీకైతే పాతికకోట్లు అన్నది ఫిక్స్ అయిపోయింది. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో తప్పితే జనరల్ నియోజకవర్గాలలో ఈ మాత్రం ఖర్చు తగ్గదు. ఓటర్లకు పంచడానికి వీలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం 2వేల నోట్లను విడుదల చేసిపెట్టింది. ఈసారి 500 నోటు చెల్లదు. కాబట్టి 2వేల నోటును ఆశ్రయించాల్సిందే! కాబట్టి అభ్యర్థుల ఎంపికలో నాయకుల సర్వీసును ఏ మాత్రం పరిగణనలోకి తీసుకునే పరిస్థితి లేదు. వాళ్లకు జెండాలు మోసే పనే! ఆరోజుకు ఎవరు డబ్బు ఖర్చు పెట్టుకోగలరనుకుంటే వారికే టిక్కెట్లు?

తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఇప్పటికే గెలుపు గుర్రాల వేటలో పడ్డాడు. రాష్ట్రంలో పాతిక లోక్‌సభ స్థానాలున్నాయి. రిజర్వ్‌డ్ స్థానాలను పక్కనపెట్టి మిగిలిన లోక్‌సభ స్థానాలలో కోట్లకు పడగలెత్తి వంద కోట్లు అంటే లెక్కపెట్టని వాళ్లను అభ్యర్థులుగా నిర్ణయించబోతున్నారు. వైకాపా అధినేత జగన్ కూడా లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో కోట్లు ఖర్చు పెట్టడాన్నే ప్రధాన అర్హతగా చూస్తున్నాడు. అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో కూడా 'కోట్లు' ప్రామాణికం కాబోతున్నాయి. అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు నిర్దయగా వ్యవహరిస్తాడు. కోట్లు లేకుంటే ఖచ్చితంగా పక్కన పెడతాడు. జగనే కొంత నయం. తనను నమ్ముకుని వచ్చారని చెప్పి డబ్బులు లేకున్నా కొందరికన్నా పార్టీ జెండాలు మోసినోళ్లకు టిక్కెట్లిచ్చే అవకాశముంది.

ఈసారి ఎన్నికలు ఐపిఎల్ మ్యాచ్‌లను తలపించడం ఖాయం. ఈ పార్టీలో వున్నోళ్ళు ఆ పార్టీ అభ్యర్థులు కావచ్చు... ఆ పార్టీలో వున్నోళ్ళు ఈ పార్టీ అభ్యర్థులు కావచ్చు. జనం మాత్రం యధాఫలంగా బకరాలు కావడానికి సిద్ధంగా వుండాలి.

# కుదురుతున్న స్నేహాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇవన్నీ ఓడిపోయేవే! పొత్తుతో ఓట్లు కలిసిరావడం, సీట్లు పెరగడం, దాంతో అధికారం దక్కడం జరిగిపోయింది. ఎన్నికలకు ఇంకో ఏడాదిన్నర కాలం వుంది. అయితే అప్పుడే పొత్తు మాటలు నడుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగిన వైకాపా దెబ్బతింది. 5లక్షల ఓట్ల తేడాతో అధికారాన్ని మిస్ చేసుకుంది. ఈసారి మాత్రం ఒంటరి పోరుకంటే పొత్తు పోరుకే ఆ పార్టీ మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ బీజేపీతోనే మళ్ళీ కలిసి నడిచే అవకాశాలున్నాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రం ఈసారి చంద్రబాబుతో కలవకుండా ఒంటరిగా పోటీ చేయాలనే ఆలోచనలో వున్నాడు. అయితే ఎన్నికలొస్తే ఏదో ఒక ప్రధానపార్టీతో పొత్తుకు ప్రయత్నించే సిపిఐ కూడా ఈసారి జనసేనతో స్నేహానికి సిద్ధంగా వున్నట్లు సమాచారం. టీడీపీ, వైకాపాలకు సమదూరం పాటించాలని, బీజేపీకి విరోధిగా మారిన పవన్‌తో చేతులు కలపాలని సిపిఐ నాయకత్వం భావిస్తోంది. తెలంగాణలోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని పవన్ కళ్యాణ్ ప్రకటించడం తెలిసిందే! పవన్‌తో కలిస్తే తెలంగాణ, ఏపిలలో ఎక్కువ స్థానాలలో తమ అభ్యర్థులను నిల బెట్టుకోవచ్చన్నది ఆ పార్టీ నేతల అంచనా!

ఇక సీపీఎం మాత్రం వైకాపాతో జత కట్టాలని ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. జనసేన అధికారంలోకి వచ్చేదీ లేదు, బీజేపీ తెలుగుదేశంతో వుంది కాబట్టి చంద్రబాబుతో వీళ్లు కలవలేరు. ఇక మిగిలిన మార్గం ఒంటరిగా పోటీ చేయడమా లేక వైకాపాతో పొత్తు పెట్టుకోవడమా? ఒంటరిగా పోటీ చేసి సాధించేదేమీ లేదు. ఒక్క సీటులో కూడా గెలుపుకు అవకాశముండదు. వైకాపాతో కలిసి పోటీ చేస్తే ఎక్కడన్నా గెలిచే అవకాశంతో పాటు అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో భాగస్వామి కావచ్చు. ఈ దృష్ట్యా సీపీఎం వైకాపా వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

2014 ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల్లో వామపక్షాల పాత్ర నామమాత్రంగా మిగిలింది. కాని, వచ్చే ఎన్నికల ద్వారానైనా అవి తమ ఉనికిని నిలబెట్టుకోవడానికి పొత్తులతోనే ప్రయాణించే అవకాశముంది.

# కలుపుకుంటేనే... గెలుపు!

(మొదటి పేజీ తరువాయి)


ఈ వర్గాలను దగ్గరకు చేర్చుకోవడం పైనే జగన్ రాజకీయ భవిష్యత్ ఆధారపడి వుంది. ఋణ మాఫీ అమలులో చంద్రబాబు విఫలమయ్యాడు. రైతులు, మహిళలు తెలుగుదేశం ప్రభుత్వంపై వ్యతిరేకతతో వున్నారు. రైతుల కోసం నవరత్నాలు పథకం ప్రకటించిన జగన్, మహిళల నమ్మకాన్ని పెంపొందించుకునే దిశగా వారికి ప్రత్యేక వరాల హామీలు ఇవ్వనున్నాడు. ఇక కాపు రిజర్వేషన్ల సెగతో చాలావరకు కాపులు చంద్రబాబుకు వ్యతిరేకంగానే వున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మెజార్టీ కాపులు తెలుగుదేశంను వ్యతిరేకించే అవకాశాలున్నాయి. జగన్ కాపు సామాజిక వర్గం నేతలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ, వారి మద్దతు కోసం కృషి చేస్తున్నాడు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ద్వారా జగన్ వారి అభిమానాన్ని చూరగొనే ప్రయత్నం చేసాడు. అలాగే హైందవ సాంప్రదాయాలను గౌరవిస్తూ, ఆచారాలను పాటిస్తూ, హిందూ మతాధిపతులు, పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకుంటూ బ్రాహ్మణులకు తనపై వున్న అభిప్రాయాన్ని మార్చుకునేలా చేస్తున్నాడు. తాను ఒక కులం వాడినో, ఒక మతం వాడినో కాదని అందరివాడినని, అందరినీ కలుపుకుపోయే వాడినని, అందరి కోసం పనిచేసే వాడినని తననుతాను మలచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందరు కూడా జగన్ మా వాడు అని భావిస్తే వచ్చే ఎన్నికల చిత్రపటం మరో విధంగా చూడొచ్చు.

# షిర్డీలో శ్రీ సాయి త్రిశూల స్థూపం



- రాష్ట్రపతి చేతుల మీదుగా ఆవిష్కరణోత్సవం
- శ్రీ సాయినాధుని సేవలో తరించిన 'ఆల్తూరు' కుటుంబం

భక్తుల పాలిట కొంగుబంగారం, కష్టాలు తీర్చి.. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవం...ఆ షిర్డీ సాయినాధుని శతాబ్ది ఉత్సవాలు షిర్డీలో ఇటీవల మహాసంరంభంగా జరిగాయి. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు షిర్డీకి వెళ్ళి శ్రీ సాయినాధుని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా బాబా భక్తుడైన ఆల్తూరి ఆదినారాయణరెడ్డి ఈ శతాబ్ది ఉత్సవాలను భక్తుల హృదయాల్లో శాశ్వతంగా ఉండిపోవాలనే ఉద్దేశంతో, బాబాకు ఎంతో ప్రీతిపాత్రమైన రోజాపూల వనంలో ఒక అద్భుతమైన స్థూపాన్ని నిర్మించారు. ఒకప్పుడు ఇక్కడున్న నీరు లేని బావిలో బాబావారు పూలు వేయగా, ఎక్కడో అట్టడుగున ఉన్న నీరు బాబావారి మహిమతో పైకి వచ్చిందని, భక్తులందరికీ ఆ నీరు ఎంతో ఉపయోగంగా ఉండిందని బాబా భక్తులు చెప్పుకుంటూ ఉంటారు. ఇప్పటికీ ఆ బావిలోని నీటినే అక్కడ అనేకమంది ప్రజలు వినియోగించుకుంటున్నారు. అంతటి మహిమాన్వితమైన ప్రదేశంలో ఈ రోజా పూలవనం ఉంది. దీనినే ఇప్పుడు అక్కడివారంతా 'లెండీ గార్డెన్'గా పిలుస్తున్నారు. శ్రీ సాయిబాబావారి మహిమలకు గుర్తుగా విరాజిల్లుతున్న ఎంతో పవిత్రమైన ఈ వనం చెంతనే ఆల్తూరి ఆదినారాయణరెడ్డి 80 అడుగుల ఎత్తున్న ఒక భారీ స్థూపాన్ని నిర్మించగా, భక్తులంతా దీనిని 'శ్రీసాయి త్రిశూల స్థూపం' అని పిలుచుకుంటున్నారు. బంగారంలా ధగధగ మెరిసే జర్మన్ మెటల్‌తో అత్యద్భుతంగా తీర్చిదిద్దబడిన ఈ స్థూపం శ్రీసాయి భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎంతో పవిత్రమైన ఈ స్థూపాన్ని భారత రాష్ట్రపతి శ్రీ రామనాధ్ కోవింద్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగరరావు, ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తదితర ప్రముఖులంతా ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంత గొప్ప దైవకార్యాన్ని మన నెల్లూరీయుడు, సాయిబాబా పేరు వింటేనే మైమరచిపోయే సాయిభక్తుడు ఆల్తూరు ఆది నారాయణరెడ్డి.. ఆధ్యాత్మికరంగంలో సింహపురి సీమ ఖ్యాతి దశదిశలా రెపరెపలాడేలా నిర్వహించడం ఎంతో అపూర్వం.. అభినందనీయం. షిర్డీసాయి మందిరాన్ని స్వర్ణకాంతుల ధగధగలతో శోభాయమానం చేసి..ఆ సాయినాధునిపై నిరుపమామైన తన భక్తిని చాటుకున్నారు. తొలినుంచీ కూడా ఆయన ఎంతో దైవభక్తితో, కోట్లాది రూపాయల వితరణతో అనేక ఆలయాలకు కొత్తవెలుగులు తెచ్చారు. శ్రీశైలం ధ్వజస్తంభాన్ని అత్యద్భుతంగా రూపొందించారు. నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం తదితర ఆలయాలకు ఆయన ఎనలేని సేవలందించారు. మూలస్థానేశ్వర ఆలయానికి ఆయన కుమారుడు గిరీష్‌రెడ్డి ఛైర్మెన్‌గా వ్యవహరిస్తూ స్వామివారి సేవలో తరిస్తున్నాడు. అనేక ఆలయాలకు కాదనకుండా లేదనకుండా భూరి విరాళాలను అందించి నిరంతరం దైవసేవ, దైవకార్యాలను నిర్వర్తిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆల్తూరువారు ఆధ్యాత్మిక రంగానికి లభించిన అనర్ఘరత్నం. నెల్లూరుసీమలో ఆయనో మణిమకుటం. ఆయన కుటుంబమంతా సాయినాధుని సేవలో తరిస్తూ ఉంది. శ్రీసాయి మహిమలకు చిహ్నంగా.. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎంతో విశిష్టమైన..'శ్రీసాయి త్రిశూల స్థూపం' నిర్మాణంతో ఆల్తూరు వారి జన్మ సార్థకమైనట్లే!.. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను, దైవభక్తినీ పెంపొందించే ఇలాంటి బృహత్తర దైవకార్యాలను ఇంకా మరిన్ని నిర్వహించేం దుకు ఆ షిర్డీ సాయినాధుని దివ్యాశీస్సులు ఆల్తూరు ఆదినారాయణరెడ్డికీ, ఆయన కుటుంబానికీ నిండుగా.. మెండుగా ఉంటాయని.. ఎల్లవేళలా ఉండాలని.. మనసారా కోరుకుంటోంది..'లాయర్'.



# "దుబాయ్ నెల్లూరీయన్స్" ఆత్మీయ సమావేశం





దుబాయ్‌లో వుంటున్న నెల్లూరు వాసులు గత కొన్నేళ్ళుగా ఒక అసోసియేషన్‌గా ఏర్పడి తరచూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులను తమ ఆత్మీయ సమావేశాలకు ఆహ్వానిస్తూ వారి ద్వారా నెల్లూరు విశేషాలను తెలుసుకుంటున్నారు. ఈ పరంపరలోనే ఈ నెల 6వ తేదీన దుబాయ్‌లోని ముష్రిఫ్ పార్క్‌లో నెల్లూరీయుల ఆత్మీయ సమావేశం ఎంతో సరదాగా జరిగింది. దుబాయ్‌లో వుంటున్న 55 కుటుంబాల నెల్లూరువాసులు ఈ సమావేశానికి హాజరయ్యారు. నోరూరించే నెల్లూరు వంటలను ఆరగించి ఆనందించారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా దుబాయ్‌లో నిర్మించిన పలు ఆకాశాన్ని తాకే భవనాల రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన ఇంజనీర్, నెల్లూరీయుడు ఫజల్ రెహ్మాన్‌ను, దుబాయ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న మరో నెల్లూరీయుడు రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. వీరిద్దరూ దుబాయ్ వచ్చి పాతికేళ్ళు అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ జ్ఞాపికలను బహుకరించారు. మొత్తం కార్యక్రమానికి ఉదయభాస్కర్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించి నిర్వహించారు.



# కలెక్టర్‌కు సీఎం ప్రశంసలు




'ఆత్మగౌరవం' పథకం అమలులో నెల్లూరుజిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజును ప్రశంసించారు. చంద్రబాబు 11వ తేదీ అమరావతి నుండి స్వచ్ఛఆంధ్రప్రదేశ్ మిషన్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ కృష్ణారెడ్డి, ఆత్మగౌరవం జిల్లా సమన్వయకర్త దువ్వూరు సుస్మితారెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నెల్లూరుజిల్లాలో ఆత్మగౌరవం కార్యక్రమాన్ని ఎలా అమలు చేసారో వివరించాలని సీఎం చంద్రబాబు కోరగా, కలెక్టర్ ముత్యాలరాజు దానికి స్పందించి జిల్లాలో ఆత్మగౌరవం అమలు చేసిన విధానాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ఆత్మగౌరవాన్ని చిత్తశుద్ధితో అమలు చేసిన కలెక్టర్ పనితనాన్ని సీఎం మెచ్చుకున్నారు.

# ఐజిబిసి అవార్డు అందుకున్న కలెక్టర్



అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ హరిత అభివృద్ధి మండలి(ఐజిబిసి) బంగారు పతకాన్ని ఇటీవల జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అందుకున్నారు. నెల్లూరు జిల్లాలోని పుట్టంరాజు కండ్రిగ అభివృద్ధికిగాను ఆ సంస్థ గోల్డ్ రేటింగ్ అవార్డును ప్రకటించి జిల్లా కలెక్టర్‌కు ఆ అవార్డును ప్రదానం చేసింది. ఈ గ్రామాన్ని ప్రఖ్యాత క్రికెటర్ సచిన్ టెండూల్కర్ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే.

# ఫోటోగ్రాఫర్‌పై దాడి దారుణం

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేస్తున్న సీనియర్ ఫోటోగ్రాఫర్ జాకీర్‌పై దాడికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల నాయకులు సోమవారం నెల్లూరులో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్ళి ఇన్‌చార్జి కలెక్టర్ ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ, ఇసుక మాఫియా చేస్తున్న అరాచకాలను చిత్రీకరిస్తూ విధి నిర్వహణలో ఉన్న జాకీర్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు వి. నరసింహులు, హనుక్, ఎం.దేవకుమార్, సుబ్బారావు, నయూమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్వామాకు కొత్త పి.డి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బి.శ్రీనివాసరావు ఈనెల 11వతేదీన తన కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ హరిత నుండి బాధ్యతలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు ఆర్డీఓగా పనిచేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌ఛార్జ్ డ్వామా పి.డిగా వున్న హరితను నెల్లూరు ఆర్డీఓగా నియమించడం తెలిసిన విషయమే.

# శ్రీసిటీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు



గ్రీన్ నగరాల జాబితాలో శ్రీసిటీ స్థానం సాధించింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐజిబిసి గ్రీన్‌సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డును కూడా అందుకుని శ్రీసిటీ తన విశిష్టను మరోసారి చాటుకుంది. జైపూర్‌లో ఇటీవల జరిగిన గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్-2017 కార్యక్రమంలో ఐజిబిసి ఛైర్మెన్ ప్రేమ్‌జైన్ సమక్షంలో శ్రీసిటీ అధ్యక్షుడు సతీష్ కామర్స్ ఈ అవార్డును అందుకున్నారు. దేశంలోనే ఈ అవార్డు పొందిన అతికొద్ది గ్రీన్ నగరాల జాబితాలో శ్రీసిటీ కూడా స్థానం దక్కించుకోవడం ఎంతో విశేషం. పర్యావరణంపై దృష్టి సారించి, భూమి వినియోగానికి చక్కని ప్రణాళిక, ఆరోగ్యం, నీరు, విద్యుత్ శక్తి వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి అంశాలపై సాధించిన క్రెడిట్ పాయింట్ల ఆధారంతో ఈ అవార్డుకు శ్రీసిటీని ఆ సంస్థ ఎంపిక చేసింది. ఈ అవార్డు తమకు లభించడం తమకెంతో సంతోషంగా ఉందని, శ్రీసిటీకి ఇదెంతో గర్వకారణమని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి పేర్కొన్నారు.

# ఇదో అద్భుతమైన సెజ్

**- శ్రీసిటీకి జపాన్ బృందం ప్రశంసలు**



జపాన్‌లోని 21 మందితో కూడిన ఉన్నతశ్రేణి పారిశ్రామికవేత్తల బృందం సోమవారి శ్రీసిటీని సందర్శించింది. జపాన్‌లోని ప్రముఖ వ్యాపార ప్రకటనల సంస్థ నిక్కాన్‌కార్యో షింబన్ ప్రెసిడెంట్ హారిహీటో ఇమిజు, జపాన్ మాజీ రాయబారి యాసుకుని ఇసుకో సారధ్యంలో విచ్చేసిన ఈ బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ పరిశ్రమలకు ప్రభుత్వం అందజేస్తున్న పలు ప్రోత్సాహకాలను, శ్రీసిటీ ప్రత్యేకతలను, ఇక్కడి పారిశ్రామిక ప్రగతిని ఆయన వారికి వివరించారు. ఇప్పటికే ఇక్కడ 20 జపాన్ దేశ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, మరిన్ని పరిశ్రమలు ఇక్కడకు రానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిక్కాన్‌కార్యో షింబన్ ప్రెసిడెంట్ హారిహీటోఇమిజు మాట్లాడుతూ, శ్రీసిటీ వ్యాపార సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలు అన్వేషించడం తమ పర్యటన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఇక్కడ ఉన్నాయని అంటూ, రెండేళ్ళ క్రితం తాను శ్రీసిటీని సందర్శించానని, అప్పటికీ ఇప్పటికీ ఇక్కడ గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఈ బృందంవారు ఇసుజు, ఫాక్స్‌కాన్ పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వివిధ పారిశ్రామిక సంస్థల ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలను చర్చించారు.

# బాధ్యతలు చేపట్టిన డిఇఓ శ్యామ్యూల్



జిల్లా విద్యాశాఖను మంచి మార్గంలో ఉన్నతంగా తీర్చిదిద్దుతానని, సమస్యలు పరిష్కరించి విద్యాశాఖను గాడిలో పెడతానని కొత్త డిఇఓ కె.శ్యామ్యూల్ అన్నారు. ఈ నెల 7న ఆయన నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డిప్యూటి డిఇఓలు, ఎంఇఓల సహకారంతో విద్యాశాఖలో పాలనను మంచి మార్గంలో పెడతానన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వాన్ని చూపినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తా నన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల వేళలను తప్పకుండా పాటించాలని, సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు డిప్యూటి డిఇఓలు, ఏ.డిలు, సూపరింటెండెంట్‌లు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి గౌరవపూర్వకంగా కొత్త డిఇఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# 8 శతాబ్దాలు మరుగునపడివున్న మహారహస్య విశ్లేషణే 'స్వర్ణహంస'







రచన:
**శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ**
పేజీలు: 134 వెల: 125/-
ప్రతులకు:
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలోని అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభించును.

'తల్లి సమస్త భాషలకు దైవత భాష'.. అని సంస్కృత భాషను ఎందరో ప్రశంసించియున్నారు. ఆ దేవభాషలో ఎన్నో నాటకాలు, కావ్యాలు వెలువడ్డాయి. వాటిలో ఒకటి నైషధ కావ్యం. ఇది శ్రీహర్షునిచే రచింపబడినది. 'నైషధం విద్వదౌషధం'..అని లోకప్రశస్తి. అనగా, ఇది విద్వాంసులకు ఔషధం వంటిది అని అర్థం. ఇట్టి గ్రంధరాజాన్ని కవిసార్వభౌముడైన శ్రీనాధుడు, శృంగార నైషధమనే పేరుతో తెలుగులోనికి అనువదించాడు. ఈ నైషధ కావ్యానికి మల్లినాధ సూరిగారు వ్యాఖ్యానం కూడా వ్రాసియున్నారు. కానీ, నైషధంలో అంతర్భాగమైయున్న వేదాంత రహస్యాలను శ్రీనాధుడు గానీ, మల్లినాధ సూరిగారు గాని పేర్కొనియుండలేదు. శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు ఆ నైషధ కావ్యాన్ని చదివి, అందులో శ్రీవిద్యా రహస్యాలు, మంత్ర, వేదాంత శాస్త్రాంశములు ఇమిడియున్నాయని వివరించి సాహితీ లోకానికి అద్భుతాన్ని ఆవహింపజేశారు. 'నైషధం విద్వదౌషధం'.. ఎలా అయ్యిందో సహేతుకంగా తన పరిశోధనా గ్రంధంలో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు నిరూపించారు. ఆ గ్రంధమే 'స్వర్ణహంస'గా రూపుదిద్దుకుంది.

ఈ 'స్వర్ణహంస' శ్రీహర్ష కవిచే విరచితమైన నైషధకావ్య పరిశీలనగా ఈ కవి పేర్కొనియున్నాడు. ఇది 134 పేజీలు గలిగి, అర్ధనారీశ్వర శివశక్తుల ముఖ చిత్రంతో అందంగా ముద్రించబడి ఉంది. 1989, 1999లలో రెండు ముద్రణలు అయి, మూడవ ముద్రణగా 2017లో వెలువడింది. ఇందులో సమీక్షలతో బాటు 17 విభాగాలున్నాయి. లోపల పేజీల్లో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారి నిలువెత్తు వర్ణచిత్రం ఆకర్షణీయంగా ఉంది.

ఇందులో ఎనిమిది శతాబ్దముల నుంచి మరుగునపడి ఉన్న మహారహస్యం గుర్తించబడి ప్రచురింపబడింది. నైషధంలోని తాత్త్విక రహస్యాలను వెలికితీసి 'స్వర్ణహంస' పేరిట వ్యాఖ్యానంగా రచించడం తెలుగు మరియు సంస్కృత పాఠకులకు ఆశ్చర్యకరము, ఆనందించదగ్గ విషయమైంది. 1960లో ఆంధ్రప్రభ దినపత్రిక సారస్వతానుబంధంలో 'స్వర్ణ హంస' శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాసాలే ఈ గ్రంధరూపాన్ని దాల్చాయి. దీనికి ఆంగ్లానువాదంగా 'ది గోల్డన్ స్వాన్' అనే గ్రంధం వ్రాయబడడం గొప్ప విశేషం.

నైషధ కావ్యం కేవలం కావ్యమే గాక, యోగ, మంత్ర, వేదాంతశాస్త్రాల మేళవింపుగా సప్రమాణంగా నిరూపించిన విమర్శనా గ్రంధమిది. ఇందులోని నాయిక కేవలం దమయంతిగా మాత్రమే గాక, శ్రీ మహాత్రిపురసుందరిగా దర్శింపబడినది. నల మహారాజును జీవాత్మగా, హంసను అజపామంత్రాధిదేవతగా, కుండినపురాన్ని శివస్థానంగా శేషేంద్రగారు నిరూపించిన తీరు అనన్య సామాన్యం. అద్భుత పరిశీలనా వైదుష్య నిలయం. రాష్ట్రేంద్రు బిరుదును పొందిన శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారి బహుముఖ పాండిత్యప్రకర్షకు ఇది సాక్ష్యం. విభిన్న కోణాలలో పరిశీలించి, శాంకర సంప్రదాయాన్ని కాంతాసమ్మితంగా నిరూపించడంలో ఈ కవి ప్రతిభా వ్యుత్పత్తులు ఇందులో స్పష్టంగా ప్రతిఫలించాయి. అసాధారణ మేధోవికసనంతో, లోతైన పరిశీలనా పటిమతో ఒక కావ్యంలోని తత్త్వ రహస్యాన్ని ఛేదించి, శ్రీ శర్మగారు విమర్శక లోకాన్ని విస్మయసంద్రంలో ముంచివేశారు. శ్రీ భట్టహర్షుని కవితా హృదయంలో మమేకమై, అతని హృదయపు లోతుల్లోని గంభీర భావరత్నాలను వెలికి తీసి ప్రకాశింపజేశారు.

ఎనిమిది శతాబ్దముల నుంచి మరుగునపడిన మహారహస్యాలు..అనే పేరుతో మంత్ర యోగ వేదాంత శాస్త్ర సంపుటిని ఒక విభాగంలో శ్రీ శర్మగారు వివరించారు. నలుడు జీవుడైతే.. దమయంతి ఉపాస్యగుణ బ్రహ్మమైన శ్రీ మహాత్రిపురసుందరిగా ఈ అధ్యాయంలో వివరించబడింది. నైషధ కథలోని ధ్వని సంప్రదాయాన్ని నిరూపించారు.

'పయోధి లక్ష్మీ ముషికేళి పల్వలే'.. శ్లోకం నుండి 'సనాళ మాత్మానన నిర్జిత ప్రభమ్'..శ్లోకం వరకు గల కావ్య భాగంలో హంస వర్ణన, అజపా మంత్రాధి దేవతగా వర్ణింపబడిన విషయాన్ని వెలికితీశారు.

'దమయంతి శ్రీ మహాత్రిపురసుందరియే' – అనే విభాగంలో 'దమనా దమనాక్ ప్రసేదుహ'..అనే శ్లోకం ద్వారా శ్రీ శర్మగారు ఆ విషయాన్ని నిరూపించారు. శాంకర సంప్రదాయాన్ని కాంతా సమ్మితముగా చెప్పుటకు అవతరించినదే నైషధీయ చరిత.. అనే విభాగంలో కావ్యంలోని ప్రధమ సర్గయందు హంసను అజపామంత్రాధిదేవతగా ధ్వనింపజేయబడిన విషయమును, ద్వితీయ సర్గయందు ముక్తజీవుడుగను, తృతీయ సర్గయందు నలుడు పరాశక్తియగు దమయంతిని చూచుట, జీవాత్మ పరమాత్మయందు సంయోగమును పొందుటయే యని సహేతుకంగా నిరూపించారు. 'నైషధంలోని హంసధ్వని'.. అనే విభాగంలో హిరణ్మయం హంస అనే వాక్యంలో ఆ హంస అజపాహంసగా ధ్వనింపజేసిన విషయాన్ని హేతుబద్ధంగా వివరించారు.

తరువాతి విభాగంలో హర్ష నైషధాన నిక్షేపింబడిన తిరస్కరిణి, చింతామణి మంత్రముల స్థితిని సోదాహరణంగా శర్మగారు మనకందించారు. పిదప భట్ట హర్ష శ్రీనాధుల మధ్యగల కవితా తారతమ్యాలను సరియైన సంఘటనతో వివేచించారు. హర్ష నైషధంలోని ప్రధాన ధ్వనిని ఒక విభాగంలో వెల్లడించిన ఈ రచయిత, తరువాతి విభాగంలో శాకుంతల నాటకమందలి నాందీస్తోత్రం, శ్రీదేవీ వైభవ శ్లోకమని సప్రమాణంగా విశదీకరించారు.

'నృణాం ఏకో గమ్య:'.. అనే విభాగంలో మనస్సును ఎలా బంధించాలో వివరించారు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ' అనే ఉపనిషద్వాక్యాన్ని పేర్కొని, బిందుస్థానాన్ని చేరడమే జీవయాత్రా గమ్యం అని జీవన గమ్యాన్ని వివరించారు.

'హిందూ', 'వీక్షణం', 'వేదమాతరమ్', 'ఆంధ్రప్రభ (ఆదివారం)', 'ఆంధ్రజ్యోతి మొదలైన ప్రముఖ పత్రికలు వీరి వ్యాసాల్ని ప్రశంసించిన విషయాలు గూడా ఇందులో చేర్చబడి ఉన్నాయి.

సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల పండితులు.. ప్రపంచ సాహిత్యం మీద, భారతీయ సాహిత్యం మీద సాధికార రచనలు చేయగల మనీషి, వచన కవిత్వం, పద్య కవిత్వంలోనూ దిట్ట, సంప్రదాయ ఆధునిక కవిత్వాలకు మేళవింపుగల శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు రచించిన ఈ అద్భుత ఆధ్యాత్మిక రహస్య నిధులను పంచిన 'స్వర్ణహంస' గ్రంథాన్ని అచ్చువేసి మనకందించిన వారి కుమారుడు శ్రీ సాత్యకి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, తెలుగు సాహితీభాషాభిమానులు ఈ విమర్శనా గ్రంథాన్ని తప్పక చదివి మన ప్రాచీన భారతీయ కావ్య గర్భ రహస్యాలను తెలుసుకుని ఆనందిస్తారని నా ఆకాంక్ష.



సమీక్షకులు: డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు
నెల్లూరు. ఫోన్: 9908855294

# కమలంలో కలతలు





నాకు పార్టీ తల్లిలాంటిది. నేను పార్టీని మించిపోయానని అందరూ అంటున్నారు. ఎవరైనా తల్లిని మించిపోగలరా..? గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో తన నేతృత్వంలో మూడోసారి విజయం సాధించాక ఆనాడు ప్రమాణస్వీకారోత్సవ సభలో నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలివి. ఆరోజు ఆయన మాటలు పార్టీ పట్ల తన చిత్తశుద్ధిని చాటుకునేలా వున్నా, వాస్తవంగా మాత్రం ఆ గెలుపు మోడీ వ్యక్తిగత నాయకత్వ సమర్ధత మూలంగా దక్కిందే! పార్టీని ఆరోజు ఆయన మించిపోలేదు. కాని, ప్రధాని అయ్యాక మించిపోతున్నాడు. పార్టీ శ్రేయస్సు, పార్టీ భవిష్యత్ కంటే కూడా తన వ్యక్తిగత నాయకత్వ పాపులారిటీకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాడు. నియంతృత్వ ఏకపక్ష ధోరణులతో బీజేపీని కొందరి పార్టీగానే పరిమితం చేస్తున్నాడు. ముఖ్యంగా పార్టీలో సీనియర్ నేతలను ఆయన అణగదొక్కుతున్న తీరు కార్యకర్తలకే నచ్చడం లేదు.

ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసే రోజే సీనియర్లను పక్కనపెట్టేసాడు. ఏ ఒక్క సీనియర్ నేతను కూడా తన మంత్రివర్గంలోకి తీసుకోలేదు. 65ఏళ్లలోపు వయస్సున్న వారైతే చురుకుగా పని చేస్తారని భావించి మంత్రి పదవులకు వయసు పరిమితి విధించాడు. యువకులకు అవకాశమివ్వాలనుకోవడంలో తప్పులేదు గాని, సీనియర్లు అయితే పని చేయలేరనే భావనే తప్పు. సీనియర్ల అనుభవం, అవగాహన పరిపాలనకు ఎంతో అవసరం. ఈరోజు మోడీ ప్రభుత్వంలో ఆ అవగాహనా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయి విధానాలపై అవగాహన వున్న మంత్రులు మోడీ కొలువులో చాలా తక్కువగా వున్నారు. అన్నీ తెలిసిన వెంకయ్యనాయుడును ఉపరాష్ట్రపతిగా పంపించేశారు. జాతీయస్థాయి రాజకీయాలు, ప్రజల ఆలోచనా విధానాలపై అవగాహన వుండి తదనుగుణంగా సూచనలు, సలహాలు ఇవ్వగల మంత్రులు ఈరోజు మోడీ కొలువులో లేకుండాపోయారు. కొందరికి అవగాహన వున్నా మోడీకి చెప్పేంత ధైర్యం లేకుండాపోయింది. అలా చెప్పే ధైర్యం లేకే ఎల్.కె. అద్వానీ అంతటి అగ్రనేతను కూడా పక్కన పెట్టే పరిస్థితులొచ్చాయి. మోడీ ప్రధాని అయ్యాక బీజేపీ కార్యకర్తలే కాదు, సామాన్య ప్రజలు కూడా బాధపడిన విషయం రాష్ట్రపతి పదవికి అద్వానీ పేరును పరిగణనలోకి తీసుకోకపోవడం. బీజేపీ చరిత్రలో ఆ పార్టీకి ఉపయోగపడ్డ నాయకుడు అద్వానీ. మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ బీజేపీకి సారథ్యం వహించి నాలుగోసారి అధికారంలోకి తెచ్చాడు. దేశంలో కాంగ్రెస్‌కు ఆ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాకే మోడీ వచ్చాడు. కాని, అద్వానీ అలాకాదు. ఒక ప్రాంతీయ పార్టీ కంటే కూడా అధ్వాన్నస్థితిలో బీజేపీ వుండగా ఆ పార్టీకి సారథ్యం వహించాడు. వ్యక్తిగత కృషితో పార్టీని 2 సీట్ల నుండి 200 సీట్లకు తీసుకువెళ్లాడు. బీజేపీ అనే మొక్కను నాటి నీళ్ళు పోసింది అద్వానీ. అది కాయలు కాసే నాటికి వాజ్‌పేయి, నరేంద్ర మోడీలు వచ్చి కోసుకుపోయారంతే!

బీజేపీలో సీనియర్లను అంటే పక్కన పెట్టేసారు. పార్టీని పది కాలాల పాటూ అధికారంలో వుండేలా చేయాల్సిన బాధ్యత ప్రధానిగా మోడీపై వుంది. పార్టీ అధికారంలో నిలబడాలంటే ప్రజల ఆదరణ కోల్పోకూడదు. ప్రజల ఆదరణ వుండాలంటే ఆర్థిక విధానాలు సక్రమంగా వుండాలి. కాని ఈ మూడున్నరేళ్లలో మోడీ అనుసరించిన ఆర్థిక విధానాలు, తీసుకొచ్చిన మార్పులు ప్రజల్లో వ్యతిరేకతను తెచ్చేలా వున్నాయి. మొదట పెద్దనోట్ల రద్దును అందరూ స్వాగతించారు. తీరా చూస్తే దాని ప్రభావం మన ఆర్థిక రంగంపై బాగానే పడింది. నోట్ల రద్దుతో కుదేలైన దేశ ఆర్థికరంగంపై జిఎస్టీ గుదిబండ వేశారు. దీని దెబ్బకు ప్రతిఒక్కరూ బలవుతున్నారు. జిఎస్టీని అమలులోకి తెచ్చాకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగ సాగింది. నరేంద్ర మోడీ వచ్చీ రాగానే నోట్ల రద్దు, జిఎస్టీతో తమను చావబాదుతాడని ప్రజలు వూహించలేదు. బీజేపీ నుండి ప్రజలు ఆశించేది ఇది కాదు. ధరలు, పన్నులు తగ్గుతాయనుకున్నారు. రిజర్వేషన్లను సమీక్షించి అర్హులకే చెందేలా చేస్తారనుకున్నారు. వాజ్‌పేయి హయాంలో స్వర్ణచతుర్భుజి ద్వారా జాతీయ రహదారుల విస్తరణ చేపట్టినట్లు, దేశ మంతటికీ ఉపయోగపడేలా నదుల అనుసంధానం వంటి దీర్ఘకాలిక ప్రాజెక్ట్‌ను చేపడుతారనుకున్నారు. కామన్ సివిల్ కోడ్‌ను అమలులోకి తేవడం, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణచడం వంటివి గట్టిగా చేస్తారనుకున్నారు. కానీ మోడీ ఇవేమీ చేయలేదు.

దేశంలో ఆర్థిక విధానాలను ఇంత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం కూడా లేదు. మొదట వ్యవస్థల్లో వున్న అవినీతిని నిర్మూలించాలి. కుంభకోణాలు లేకుండా చేయాలి. ఈ విషయంలో గత యూపిఏ కంటే మోడీ ప్రభుత్వమే బాగుంది. పన్నుల విధానాన్ని సరళీకృతం చేసి దేశంలో పన్ను చెల్లింపుదారులను ఇంకా పెంచివుండాలి. కాని మోడీ ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులను ఎక్కువగా భయపెడుతోంది. మోడీ ఆర్థిక విధానాలపై ఇటీవల బీజేపీ సీనియర్ నేత యశ్వంత్ సిన్హా విరుచుకుపడడం తెలిసిందే! ఈ బాటలోనే మరికొందరు బీజేపీ నేతలు కూడా వున్నారు. వీరందరు మోడీ దెబ్బకు భయపడి నోర్లు తెరవడం లేదు. ముఖ్యంగా యూపిలో బీజేపీ విజయం చూసాక పార్టీలో మోడీని ఎదిరించే ధైర్యం, ప్రశ్నించే తత్వం ఎవరికీ లేకుండాపోయింది. త్వరలో గుజరాత్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఏ రాష్ట్రంలో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలినా సొంత పార్టీలోనే మోడీపై నేతల విమర్శల దాడి ఖాయం.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com